

మధ్యవర్తిత్వంపై అవగాహన ర్యాలీ

6



నిధులు గోల్‌మాల్!

తరకటూరు పీఏసీఎస్‌లో నిధులు గోల్‌మాల్ అయ్యాయి. తీసుకున్న రుణం తిరిగి చెల్లించినా సెక్రటరీ రశీదు ఇవ్వకపోవడంతో అనుమానం వచ్చిన రైతు కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు విచారణ చేపట్టిన అధికారులు రూ.78 లక్షల వరకు నిధులు గోల్‌మాల్ అయినట్టు ప్రాథమిక అంచనాకు వచ్చారు. క్యాష్ బుక్ మాయం చేసిన సెక్రటరీ అజ్ఞాతంలోకి వెళ్లిపోయాడు. దీంతో పూర్తిస్థాయిలో వివరాలు సేకరించే పనిలో సహకారశాఖ అధికారులు నిమగ్నమయ్యారు.

తరకటూరు పీఏసీఎస్‌లో అవినీతిపై కలెక్టర్‌కు రైతు ఫిర్యాదు

క్యాష్ బుక్ మాయం

కలెక్టర్ ఆదేశాలతో తరకటూరు పీఏసీఎస్‌లో జరిగిన అక్రమాలపై సహకారశాఖ అధికారులు ఇటీవల విచారణ ప్రారంభించారు. జిల్లా సహకారశాఖ అధికారి చంద్రశేఖరరెడ్డి మంగళవారం తరకటూరు పీఏసీఎస్‌కు వెళ్లి రికార్డులను తనిఖీ చేశారు. కేడీసీసీబీ గూడూరు బ్రాంచ్ మేనేజరును తరకటూరు పీఏసీఎస్‌కు పిలిపించి మరీ విచారణ చేశారు. ఈ సందర్భంగా పలువురు రైతులు తాము పీఏసీఎస్ సెక్రటరీకి ఫోన్‌పే, గూగుల్‌పే ద్వారా నగదు చెల్లించామని, మరికొందరు రైతులు పీఏసీఎస్‌కు వచ్చి నగదును సెక్రటరీకి ఇచ్చామని తెలిపారు. మరికొందరు రైతులు మా ఇంటి పేరుతో ఉన్న సెక్రటరీని నమ్మి పంట రుణాలు కట్టే నిమిత్తం నగదు చేతికి ఇచ్చామని, రశీదులు మాత్రం ఇవ్వలేదని అధికారులకు వివరించారు. రైతులు తిరిగి రుణాలు చెల్లించే సమయంలో రైతులకు రసీదులు రాసి ఇచ్చే క్యాష్ బుక్ ఒకటి పీఏసీఎస్‌లో మాయమైనట్లుగా అధికారులు గుర్తించారు. రైతుల నుంచి రుణాలు వసూలు చేసిన సమయంలో పీఏసీఎస్‌కు చెందిన రికార్డులలో కాకుండా, తాను సొంతంగా పెట్టుకున్న పుస్తకంలో రైతులు రుణాలు చెల్లించినట్లుగా రాసి, తర్వాత రశీదులు ఇస్తానని సెక్రటరీ రైతులను నమ్మించి మోసం చేసినట్లుగా తమ ప్రాథమిక విచారణలో వెల్లడైందని డీసీవో తెలిపారు. తరకటూరు పీఏసీఎస్ సెక్రటరీ పెద్దమొత్తంలో నగదును పక్కదారి పట్టించడంతో అతని ఆస్తులను అటాచ్ చేసేందుకు వెనకాడబోమని డీసీవో చెప్పారు. ఈ పీఏసీఎస్‌లో 600 మందికిపైగా రైతులు ఉన్నారని, వారు తీసుకున్న రుణాలు, తిరిగి చెల్లించిన నగదు వివరాలను అందించాలని కోరామని, త్వరితగతిన ఈ పీఏసీఎస్‌లో విచారణను పూర్తిచేయాలని అధికారులను ఆదేశించినట్లు డీసీవో వివరించారు.

విచారణలో రూ.78 లక్షల వరకు దుర్వినియోగమైనట్టు నిర్ధారణ

- క్యాష్ బుక్ మాయం చేసిన పీఏసీఎస్ సెక్రటరీ
- సమగ్రంగా వివరాలు సేకరించే పనిలో సహకారశాఖ అధికారులు

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం: గూడూరు మండలం తరకటూరు పీఏసీఎస్ సెక్రటరీగా గళ్లా శ్రీనివాసరావు పనిచేస్తున్నారు. ఆయన రైతులు తీసుకున్న పంట రుణాలు తిరిగి చెల్లించే సమయంలో రశీదులు ఇవ్వలేదు. అడిగితే తర్వాత ఇస్తానని చెప్పడంతో వెళ్లిపోయారు. మరికొందరు రైతులు ఈ సెక్రటరీపై ఉన్న నమ్మకంతో ఫోన్‌పే, గూగుల్‌పే ద్వారా నగదు చెల్లించారు. వారికి కూడా పంట రుణం చెల్లించినట్టుగా రశీదులు ఇవ్వలేదు. ఈ విధంగా గత ఏడాది కాలంగా కొనసాగుతోంది. ఎంతకూ రశీదులు ఇవ్వకపోవడంతో పలువురు రైతులు గట్టిగా అడిగితే తనపై నమ్మకం లేదా అంటూ వారిని నోరెత్తనీయలేదు. ఈక్రమంలో ఈ సెక్రటరీ పనితీరు బాగుండక పోడంతో తరకటూరుకు చెందిన యానాదిరావు అనే రైతు ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. అధికారులు విచారణకు ఆదేశించారు. సెక్రటరీకి చెల్లించిన పంట రుణాల నగదు



గూడూరు మండలం తరకటూరు పీఏసీఎస్ కార్యాలయం

రూ.78 లక్షల వరకు ఉంటుందని రైతులు చెబుతున్నారు. ఇందులో కొంత మొత్తాన్ని పీఏసీఎస్‌లో జమ చేసిన సెక్రటరీ, మిగిలిన మొత్తం చెల్లించే స్థోమతలేక కొద్ది రోజులుగా అజ్ఞాతంలోకి వెళ్లిపోయాడు. ఈ సెక్రటరీ తరకటూరులోని తన సొంత భూమిలో ఈ ఏడాది వరి నాట్లు వేయకుండా ఖాళీగా వదిలేయడంపై ఆరా తీస్తే ఆయన కొద్దిరోజులుగా తప్పించుకు తిరుగుతున్నాడనే విషయం బయట పడింది.

ఈ పీఏసీఎస్‌ల్లో అవినీతిపై చర్యలేవి?

జిల్లాలో పలు పీఏసీఎస్‌లలో అక్రమాలు బయటపడినా అధికారులు విచారణను పూర్తి చేయకుండా సాచివేత ధోరణితో వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. మచిలీపట్నం మండలం గోకవరం పీఏసీఎస్‌లో రైతులు తీసుకున్న రుణాలు చెల్లించినట్లు పీఏసీఎస్ రికార్డులలో చూపినా, కేడీసీసీ మచిలీపట్నం బ్రాంచ్‌లో ఈ నగదును జమచేయలేదు. రైతుల ఫిర్యాదుతో ఈ పీఏసీఎస్‌లో జరిగిన అక్రమాలపై సహకారశాఖ అధికారులు గత నాలుగు నెలలుగా విచారణ చేస్తూనే ఉన్నారు. అధికారుల ప్రాథమిక విచారణలో రూ.50లక్షలను సంబంధిత సెక్రటరీ వాడుకున్నట్లుగా రుజువైంది. అయినా బాధ్యుడిపై చర్యలు తీసుకోకుండా జాప్యం చేయడం గమనార్హం.

● గూడూరు మండలం ముక్కొల్లు పీఏసీఎస్‌లో రుణాలు తీసుకున్న రైతుల నుంచి రుణాల వసూలు పేరుతో పీఏసీఎస్ సెక్రటరీ తన ఫోన్‌పే నెంబరుకు నగదును జమ మిగతా 6లో..

గొల్లపూడి వరకు ఆరు వరుసలు

ఫలించిన విజయవాడ ఎంపీ కేశినేని చిన్ని కృషి

- హైదరాబాద్ నుంచి గొల్లపూడి వరకు ఎన్‌హెచ్-65 విస్తరణకు ఒకే!
- చివరి నిమిషంలో ప్రమాదం గుర్తించి.. సమావేశం నిర్వహించిన ఎంపీ
- హైదరాబాద్ ఓఆర్ఆర్ టూ అమరావతి ఓఆర్ఆర్ వరకు మాత్రమే విస్తరణ అని చెప్పిన అధికారులు
- తీవ్రంగా వ్యతిరేకించి.. గొల్లపూడి వరకు పొడిగించాలని పట్టు
- సంబంధిత కేంద్ర ప్రభుత్వ ఉన్నతాధికారులకు లేఖలు రాయటంతో సత్ఫలితాలు


(ఆంధ్రజ్యోతి, విజయవాడ): బెజవాడ ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని) చేసిన కృషి ఫలించింది. హైదరాబాద్ నుంచి విజయవాడ వరకు ఉన్న ఎన్‌హెచ్-65 విస్తరణను గొల్లపూడి వరకు తీసుకురాగలిగారు. వివరాల్లోకి వెళితే.. హైదరాబాద్ అవుటర్ రింగ్ రోడ్డు నుంచి అమరావతి అవుటర్ రింగ్ రోడ్డు వరకు మాత్రమే ఎన్‌హెచ్-65 విస్తరణ చేపడతామని అక్కడి ఎన్‌హెచ్ అధికారులు ప్రతిపాదించారు. చివరి నిమిషంలో ఈ విషయం తెలియటంతో కొద్ది రోజుల కిందట కేశినేని చిన్ని ఆగమేఘాల మీద విజయవాడలో కలెక్టర్ లక్ష్మీశ, తెలంగాణలోని ఎన్‌హెచ్ అధికారులతో అత్యవసర సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో అక్కడి ఎన్‌హెచ్ అధికారులు ఎన్‌హెచ్-65 విస్తరణ అమరావతి ఓఆర్ఆర్ వరకేనని చెప్పారు. దీన్ని ఎంపీ కేశినేని చిన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. ఆ ప్రతిపాదన సరికాదని అభ్యంతరాలను తెలిపారు. విజయవాడ వరకు ఎన్‌హెచ్-65 మిగతా 6లో..

ఇక 6 లేన్లుగా..

మచిలీపట్నం నుంచి గంగూరు వరకు ఎన్‌హెచ్ - 65ను ఆరు వరుసలుగా విస్తరించేందుకు మార్గం సుగమం అయింది. గంగూరు నుంచి కానూరు వరకు నాలుగు వరుసలను అలాగే ఉంచి ఇరువైపులా సర్వీసు రోడ్లు ఏర్పాటు చేయడానికి ప్రతి పాదిస్తున్నారు. ఈ క్రమంలో ఆక్రమణలను పూర్తిస్థాయిలో తొలగించనున్నారు. కానూరు నుంచి విజయవాడ వరకు విస్తరణ చేయడం సాధ్యంకాదని చెబుతున్నారు. వీటికి సంబంధించిన తుది డీపీఆర్‌ను ఎన్‌హెచ్ అధికారులకు చైతన్య కన్సల్టెన్సీ ఇవ్వనుంది.

మచిలీపట్నం నుంచి గంగూరు వరకు ఎన్‌హెచ్-65 విస్తరణకు మార్గం సుగమం

- గంగూరు నుంచి కానూరు వరకు సర్వీసు రోడ్లతో కూడిన నాలుగు వరుసలు
- కానూరులో ఆక్రమణల తొలగింపు అనివార్యం
- కానూరు - విజయవాడ వరకు విస్తరణ లేనట్టే!
- ఎన్‌హెచ్ అధికారుల చేతికి త్వరలో తుది డీపీఆర్



(ఆంధ్రజ్యోతి, విజయవాడ): కృష్ణాజిల్లా కేంద్రం మచిలీపట్నం నుంచి పెనమలూరు మండలం గంగూరు గ్రామం వరకు అరవై ఐదవ నెంబర్ జాతీయ రహదారి (ఎన్‌హెచ్ - 65)ను ఆరు వరుసలుగా విస్తరించేందుకు మార్గం సుగమం అయింది. విజయవాడ - మచిలీపట్నం ఎన్‌హెచ్ - 65ను ఆరు లేన్లుగా విస్తరించేందుకు వీలుగా ఎన్‌హెచ్ విజయవాడ డివిజన్ అధికారులు డీపీఆర్ తయారు చేయిస్తున్న సంగతి తెలిసిందే. డీపీఆర్‌కు రూపకల్పన చేస్తున్న చైతన్య కన్సల్టెన్సీ ప్రాథమికంగా ఈ మేరకు డీపీఆర్‌లో పొందుపరిచింది. తుది డీపీఆర్‌ను అతి త్వరలో ఎన్‌హెచ్ అధికారులకు అప్పగించనుంది. మచిలీపట్నం నుంచి గంగూరు వరకు 57 కిలోమీటర్ల మేర ఆరు వరుసలుగా విస్తరించేందుకు ప్రతిపాదించటం జరిగింది. మచిలీపట్నం నుంచి గంగూరు వరకు ఎలాంటి భూ సేకరణ చేయాల్సిన అవసరం కూడా లేదు. భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకుని ముందస్తుగా భూ సేకరణ చేయటం వల్ల విస్తరణకు ఎలాంటి ఇబ్బందులు మిగతా 6లో..

ఐదు కిలోమీటర్ల సర్వీసు రోడ్లు

గంగూరు గ్రామం నుంచి కానూరు గ్రామం వరకు ప్రస్తుతం ఉన్న నాలుగు వరుసల రహదారి అలాగే ఉంటుంది. దీనికి అదనంగా సర్వీసు రోడ్లను ఎన్‌హెచ్ అధికారులు ప్రతిపాదిస్తున్నారు. కన్సల్టెన్సీ కూడా ఈ మేరకు సూచించటం జరిగింది. గంగూరు నుంచి కానూరు వరకు ఐదు కిలోమీటర్ల మేర ప్రస్తుతం నాలుగు వరుసల రోడ్డు ఉంది. ఈ రోడ్డుకు సర్వీసు రోడ్లు లేవు. ఇక మీదట సర్వీసు రోడ్లు వేస్తారు. కానూరు వరకు అంటే దాదాపుగా విజయవాడతో అనుసంధానం అవుతుంది. కానూరు నుంచి ఉన్న ట్రాఫిక్ ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని సర్వీసు రోడ్లను అభివృద్ధి చేస్తారు. దీనివల్ల ప్రధాన హైవే మార్గం మీద ఎలాంటి ట్రాఫిక్ పడదు. సర్వీసు రోడ్లు ఉండటం వల్ల సమీప గ్రామ, ప్రాంతాల ప్రజలకు సౌలభ్యంగా ఉంటుంది. కానూరులో గతంలో భూ సేకరణ జరిపారు. ప్రస్తుతం మళ్లీ ఆక్రమణలు వెలిశాయి. వీటిని తొలగించి సర్వీసు రోడ్లను అభివృద్ధి చేస్తారు.

తామర పూల కోసం వెళ్లి ఇద్దరు విద్యార్థులు మృతి

గన్నవరం తొండం గట్టు చెరువు వద్ద ఘటన ● రెండు కుటుంబాల్లో విషాదం

చైతన్యకుమార్, సతీష్ మృతదేహాల వద్ద విలపిస్తున్న తల్లులు





గన్నవరం, జూలై 16 (ఆంధ్రజ్యోతి): తామర పూలు కోసమని చెరువులో దిగిన ఇద్దరు విద్యార్థులు ఊబిలో కూరుకుపోయి మృతి చెందిన హృదయవిదారక ఘటన గన్నవరంలో జరిగింది. ఎస్సై శ్రీధర్ తెలిపిన వివరాల ప్రకారం.. స్థానిక సగర్లపేటకు చెందిన ముగ్గురు విద్యార్థులు బుధవారం సాయంత్రం కోనాయి చెరువు పక్కనే ఉన్న తొండం గట్టు చెరువులో తామర పూలు కోసం వెళ్లారు. పోట్రు సతీష్(15), నక్కా చైతన్య కుమార్(12) తొండం గట్టు చెరువులో దిగారు. ఊబి ఎక్కువగా ఉండటంతో ఇద్దరూ దానిలో కూరుకుపోయారు. దీంతో వారితో పాటు వెళ్లిన మరో విద్యార్థి కేకలు వేస్తూ చుట్టు పక్కల వారిని పిలిచాడు. స్థానికులు వెంటనే అక్కడకు చేరుకుని విద్యార్థులను ఊబిలో నుంచి బయటకు తీసి ఆస్పత్రికి తరలించారు. పరిశీలించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్టు నిర్ధారించారు. సతీష్ పదవ తరగతి పూర్తి చేసి ఇంటి వద్దనే ఉంటున్నాడు. చైతన్యకుమార్ గన్నవరం బాలుర హైస్కూల్‌లో 7వ తరగతి చదువుతున్నాడు. సతీష్ తండ్రి మిగతా 6లో..



● మెగా జాబ్‌మేళాకు విశేష స్పందన

మచిలీపట్నం ఆంధ్ర జాతీయ కళాశాల ప్రాంగణంలో రాష్ట్ర నైపుణ్యాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన జాబ్‌మేళాకు విశేష స్పందన లభించింది. 30 మెగా కంపెనీలు ఏర్పాటు చేసిన ఇంటర్వ్యూలకు 1500 మంది నిరుద్యోగులు హాజరయ్యారు. ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ ప్రతి ఆరు నెలలకు ఒక జాబ్‌మేళా నిర్వహించి నిరుద్యోగ యువతీ యువకులకు ఉద్యోగావకాశాలు కల్పిస్తామని భరోసా ఇచ్చారు.

6

● చీపుర్లతో తెలుగు మహిళల ప్రదర్శన



కూటమి ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్న మాజీ మంత్రి పేర్ని నాని ఇంటిని ముట్టడించేందుకు తెలుగు మహిళలు చీపుర్లను చేత బట్టి బుధవారం ప్రయత్నించారు. పోలీసులు అడ్డుకోవడంతో రామానాయుడుపేట సెంటర్‌లో నిరసన ప్రదర్శన నిర్వహించారు. పేర్నికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.



కానుకల లెక్కింపును పర్యవేక్షించిన ఈవో శీనానాయక్

దుర్గమ్మ కానుకలు రూ.4.37 కోట్లు

ఇంద్రకీలాద్రి, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : ఇంద్రకీలాద్రిపై కనక దుర్గమ్మకు భక్తులు హుండీల్లో సమర్పించిన కానుకలు 23 రోజులకు గాను రూ.4,37,16,236 నగదు రూపంలో సమకూరాయి. బుధవారం మహామండపంలో కానుకలను ఈవో శీనానాయక్ పర్యవేక్షణలో సిబ్బంది లెక్కించారు. రూ.4.37 కోట్లకు పైగా నగదు, 395 గ్రాముల బంగారం, 9,614గ్రాముల వెండి సమకూరాయి.

ఎండ నుంచి రక్షణ..



నగరంలో పెరిగిన ఉష్ణోగ్రతల దృష్ట్యా కొండపై భక్తులకు ఇబ్బంది లేకుండా ఈవో ఆదేశాల మేరకు ఆలయ ప్రాంగణంలో సిబ్బంది పట్టాలను ఏర్పాటు చేశారు. ఖాళీ ప్రదేశాల్లో నీటిని చల్లించారు.



పెయ్యదూడల ఉత్పత్తి సెమెన్‌ను వెటర్నరీ డాక్టర్లకు అందజేస్తున్న చలసాని ఆంజనేయులు

పెయ్యదూడల ఉత్పత్తితో

పాడి రైతుల ఆర్థికాభివృద్ధి

- కృష్ణా మిల్క్ చైర్మన్ చలసాని ఆంజనేయులు

చిట్టినగర్, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : పాడి రైతుల ఆర్థికాభివృద్ధికి పెయ్యదూడల ఉత్పత్తి పథకం దోహదపడుతుందని కృష్ణామిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు అన్నారు. బుధవారం చిట్టినగర్ పాలఫ్యాక్టరీ సమావేశ హాలులో పెయ్యదూడల ఉత్పత్తి పథకాన్ని చలసాని ఆంజనేయులు ప్రారంభించారు. అనంతరం వీర్యం కంటైనర్‌ను వెటర్నరీ డాక్టర్లకు అందజేశారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి చంద్రబాబు ఆలోచనకు అనుగుణముగా పాడి రైతుల ఆర్థికాభివృద్ధికి పెయ్యదూడల ఉత్పత్తి పథకాన్ని కృష్ణా మిల్క్ యూనియన్ పాడి రైతులకు అందిస్తోందన్నారు. ఎన్డీడీ సహకారంతో పెయ్యదూడల ఉత్పత్తి చేసే వీర్యాన్ని రైతులకు డోస్ రూ. 150లకు అందుబాటులోకి తెస్తున్నామన్నారు. గతంలో ఈ ధర రూ. 250 ఉండేదన్నారు. ఈ వీర్యం వలన పుట్టిన దూడల్లో 95శాతం పెయ్య దూడలు ఉంటాయని పెయ్య దూడలతో పాడి అభివృద్ధి చేసుకుంటారన్నారు. ఒక్కొక్క గేదెకు రూ.350-400 వరకు యూనియన్ ఖర్చు పెడుతుందన్నారు. కార్యక్రమంలో యూనియన్ మేనేజింగ్ డైరెక్టర్ కొల్లి ఈశ్వరబాబు, జిల్లా పశువుల అభివృద్ధి సంస్థ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ కె.శ్రీనివాస్, ప్రొఫెసర్, హెడ్ వెటర్నరీ కళాశాల గన్నవరం డాక్టర్ సీహెచ్ వెంకట శేషయ్య, సమితి వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న జిల్లా న్యాయాధికారి గోపీ, న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి రామకృష్ణయ్య తదితరులు

మధ్యవర్తిత్వంపై అవగాహన ర్యాలీ

మచిలీపట్నం టౌన్, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కోర్టు ప్రధాన న్యాయాధికారి జి.గోపి ఆధ్వర్యంలో బుధవారం మధ్యవర్తిత్వంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయాధికారి మాట్లాడుతూ, మధ్యవర్తిత్వం ద్వారా కేసులను పరిష్కరించుకోవచ్చన్నారు. సమస్యను మధ్యవర్తి ద్వారా పరిష్కరించుకోవడం మనదేశం మూలాల్లోనే ఉన్నదన్నారు. ఈ అవకాశాన్ని ప్రతిఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఉమ్మడి కృష్ణాజిల్లా జగ్గయ్యపేట, నందిగామ, విజయవాడ, గుడివాడ, మచిలీపట్నం, అవనిగడ్డ కోర్టుల పరిధిలో ఉన్న కేసులను మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కరించుకోవాలని విజ్ఞప్తి చేశారు. మధ్యవర్తిత్వం ప్రోగ్రాం 90 రోజులు నిర్వహిస్తున్నామని, మధ్యవర్తిత్వం ద్వారా కోర్టులో కక్షిదారులు మాట్లాడుకుని సమస్యను పరిష్కరించుకోవచ్చన్నారు. ర్యాలీలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు దివి పోతురాజు, పలువురు న్యాయమూర్తులు, న్యాయవాదులు, కక్షిదారులు పాల్గొన్నారు.



కుమ్మమూరులో గృహ లబ్ధిదారుడి నుంచి వివరాలు సేకరిస్తున్న నందు

కేంద్ర పథకాలు అర్హులందరికీ చేరాలి

- కుమ్మమూరు, గరికపర్రు గ్రామాల్లో కేంద్ర బృందం పర్యటన

తోట్లవల్లూరు, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా చర్యలు తీసుకోవటం, లోపాలుంటే ప్రజల నుంచి తెలుసుకుని కేంద్రానికి నివేదించటం జరుగుతుందని కేంద్ర బృందం సభ్యులు ప్రభాస్ వర్మ, నందు తెలిపారు. మండలంలోని కుమ్మమూరు, గరికపర్రు గ్రామాల్లో బుధవారం వారు పర్యటించారు. వ్యవసాయ, డ్వాక్రా, హౌసింగ్, విద్య, ఇరిగేషన్ శాఖలపై సంబంధిత అధికారుల నుంచి వివరాలు సేకరించారు. హౌసింగ్ లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి ఆధార్‌కార్డు తీసుకుని వివరాలు అడిగి తెలుసుకున్నారు. మహిళలతో బహిరంగ సమావేశంలో కేంద్ర పథకాల్లో లోపాలున్నా, ఎవరికైనా అందకపోయినా తెలియజేయాలని సభ్యులు కోరారు. కుమ్మమూరు, గరికపర్రు సర్పంచ్‌లు బొమ్మారెడ్డి వెంకటరెడ్డి, వీరంకి రమాదేవి, ఎంపీటీసీ సభ్యుడు నర్రా వెంకట అప్పారావు, జడ్పీ సీఈవో కన్నమనాయుడు, డ్వామా పీడీ శివప్రసాద్, డిఎల్‌డివో రాజేష్, ఎంపీడీవో రవికాంత్, ఈవోపీఆర్‌డి వెంకటేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

20 లక్షల మందికి ఉద్యోగాలు లక్ష్యం

- ఓడల నిర్మాణానికి గోవా కంపెనీతో ఎంవోయూ
- క్రిటికల్ మినరల్ పార్కు ఏర్పాటుకు కృషి
- స్టీల్ ఫ్యాక్టరీ నెలకొల్పేందుకు యోచన
- మెగా జాబ్‌మేళాలో మంత్రి కొల్లు రవీంద్ర



మెగా జాబ్‌మేళాలో మాట్లాడుతున్న మంత్రి రవీంద్ర, చిత్రంలో కలెక్టర్, ఎస్పీ తదితరులు

మచిలీపట్నం టౌన్, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : ఐదేళ్లలో 20 లక్షల మంది నిరుద్యోగులకు ఉపాధి కల్పన లక్ష్యంగా కూటమి ప్రభుత్వం అన్ని ప్రయత్నాలు చేస్తోందని ఎక్సైజ్‌శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. మచిలీపట్నం ఆంధ్రజాతీయ కళాశాల ప్రాంగణంలో నైపుణ్యాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన జాబ్‌మేళాకు 1500 మంది యువత హాజరయ్యారు. 30 మెగా కంపెనీల నుంచి సిబ్బంది రాగా.. జాబ్‌మేళాను మంత్రి రవీంద్ర ప్రారంభించి ప్రసంగించారు. ప్రతి ఆరు నెలలకు ఒక జాబ్‌మేళా నిర్వహించి యువతీ యువకులకు ఉద్యోగావకాశాలు కల్పిస్తామన్నారు. ఇందుకుగాను శిక్షణా తరగతులు నిర్వహిస్తామన్నారు. 2026 డిసెంబరు నాటికి మచిలీపట్నం ఓడరేవు పూర్తవుతుందని, పలు ఉద్యోగావకాశాలు ఏర్పడతాయన్నారు. మచిలీపట్నంలో ఓడల నిర్మాణానికి గోవా షిపింగ్ కంపెనీ మచిపట్నంలో స్థలం కావాలని కోరారని ఇందుకు ముఖ్యమంత్రి ఎంవోయూ చేసుకుంటున్నారన్నారు. విశాఖపట్నంకు చెందిన సింహాద్రి టీఎంటీ కంపెనీ రూ.10వేల కోట్లతో మచిలీపట్నంలో స్టీల్ ప్లాంట్ నిర్మాణానికి వెయ్యి ఎకరాలు స్థలం కోరారని, ఈ ప్లాంట్ నిర్మిస్తే బందరు లో అందరికీ ఉద్యోగావకాశాలు లభిస్తాయన్నారు. అక్టోబరు 2 నాటికి ఆంధ్రజాతీయ కళాశాల పక్కన ఉన్న డంపింగ్ యార్డును పార్కుగా రూపొందిస్తామన్నారు. ఆంధ్రజాతీయ కళాశాలలో రీసెర్చిసెంటర్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. మంగినపూడి బీచ్ ఫెస్టివల్ తరువాత పర్యాటకరంగానికి మంచి ప్రోత్సాహం వచ్చిందన్నారు. గనులశాఖ ఆధ్వర్యంలో మచిలీపట్నంలో క్రిటికల్ మినరల్ పార్కు ఏర్పాటు చేస్తామన్నారు. రూ.30వేల కోట్ల పెట్టుబడితో చేపట్టే ఈ ప్రాజెక్టు ద్వారా ఉద్యోగావకాశాలు లభిస్తాయన్నారు. కలెక్టర్ డీకే బాలాజీ మాట్లాడుతూ, జాబ్‌మేళా కేవలం ఉద్యోగాల కోసమే కాదని, జీవితాన్ని అందించే సమ్మేళనమన్నారు. మచిలీపట్నంలో మునుపెన్నడూ లేని విధంగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నామన్నారు. ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ మాట్లాడుతూ, నిరుద్యోగ యువత జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎస్పీ ఆర్.గంగాధరరావు మాట్లాడుతూ, 17న కరగ్రహారంలో 46 ఎకరాలలో నూతనంగా పోలీసు శిక్షణా కేంద్రానికి శంకుస్థాపన చేసేందుకు హోంమంత్రి వస్తున్నారన్నారు. కార్యక్రమంలో సీడాప్ జేడీఎం సుమలత, జిల్లా ఉపాధి కల్పనాధికారి విక్టర్‌బాబు, డీఆర్డీఏ పీడీ హరిహరనాథ్, జిల్లా నైపుణ్యాలాభివృద్ధి అధికారి నరేష్‌కుమార్, దేవదాయశాఖ సహాయ కమిషనర్ లలిత, మెప్మా పీడీ సాయిబాబు, మార్కెటింగ్‌శాఖ ఏడీ నిత్యానందం, గొర్రెపాటిగోపీచంద్, కుంచే నాని, గోపు సత్యనారాయణ, కాగిత వెంకటేశ్వరరావు, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ మాజీ చైర్మన్ తలారి సోమశేఖర్, జనసేన నాయకులు మాదివాడ రాము తదితరులు పాల్గొన్నారు.

2029 నాటికి శూన్య పేదరికం దిశగా..

- మార్గదర్శులుగా 2,557 మంది
- ఇదే స్ఫూర్తితో మరింత మంది చేయూతనివ్వాలి
- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ



పీ-4 విధివిధానాలను వివరిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ

కలెక్టరేట్, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : సమాజం నుంచి పేదరికాన్ని సమూలంగా దూరం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం పీ-4 విధానాన్ని అమలుచేస్తున్నట్టు కలెక్టర్ లక్ష్మీశ అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ లక్ష్మీశ, జాయింట్ కలెక్టర్ ఇలక్కియతో కలిసి వివిధ పరిశ్రమలు, స్వచ్ఛంద సంస్థలు, ఆసుపత్రులు, అసోసియేషన్ల ప్రతినిధులతో పీ-4 విధానంపై అవగాహన సదస్సు నిర్వహించారు. పీ-4 విధివిధానాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, సమాజంలో పైనున్న పదిశాతం మంది అట్టడుగున ఉన్న 20 శాతం కుటుంబాలను పైకి తీసుకొచ్చేందుకు వినూత్నంగా పీ-4 విధానాన్ని తీసుకురావడం జరిగిందని, జిల్లాలో ఇంటింటి సర్వేద్వారా 86,398 బంగారు కుటుంబాలను గుర్తించామని, ఇప్పటికే 2,557 మంది మార్గదర్శులుగా ముందుకొచ్చారని, 18,373 కుటుంబాలను దత్తత తీసుకున్నారని వివరించారు. రెడ్‌క్రాస్, విజయవాడ మహానగర్ లయన్స్‌క్లబ్, అమ్మా అసోసియేషన్ వంటి సంస్థలు పెద్దమొత్తంలో బంగారు కుటుంబాలను దత్తత తీసుకునేందుకు ముందుకొచ్చాయన్నారు. ఈ స్ఫూర్తిని కొనసాగిస్తూ పారిశ్రామికవేత్తలు, ఎన్నారైలు, స్వచ్ఛంద సంస్థలు, దాతలు ముందుకు రావాలన్నారు. సమావేశంలో సీపీవో వై.శ్రీలత, గ్రామ, వార్డు సచివాలయాల సమన్వయ అధికారి జి.జ్యోతి, వివిధ పరిశ్రమలు, సంస్థల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ప్రగతి సూచికలపై ప్రత్యేక దృష్టి

కలెక్టరేట్ : జిల్లా స్థూల ఉత్పత్తి (జీడీడీపీ), స్థూల విలువ జోడింపు (జీవీఏ) పెంపు లక్ష్యంగా రూపొందిన జిల్లా, నియోజకవర్గ దార్శనిక ప్రణాళికల లక్ష్యాలను చేరుకోవాలంటే కీలక ప్రగతి సూచికలపై ప్రత్యేకంగా దృష్టిసారించాల్సి వుంటుందని కలెక్టర్ లక్ష్మీశ అన్నారు. బుధవారం పరిశ్రమలు, ఉద్యాన, పౌర సరఫరాల శాఖల అధికారులతో స్వర్ణాంధ్ర విజన్ - కీలక ప్రగతి సూచికలు (కేపీఐ)పై కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, శాఖల వారీగా సూచికలను గుర్తించడం జరిగిందని, ఈ సూచికల్లో ప్రగతి మొత్తం జిల్లా అభివృద్ధికి దోహదపడుతుందని వివరించారు. ప్రగతి సూచికల్లో పురోగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించడం జరుగుతుందని పేర్కొన్నారు. ఎంఎస్ఎంఈల్లో కొత్త పెట్టుబడులు, ఎగుమతుల విలువ పెంపు, పరిశ్రమల్లో ఉపాధి సృష్టి, మైక్రో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటు తదితరాలపై పరిశ్రమల శాఖ దృష్టి సారించాల్సి వుంటుందన్నారు. సూక్ష్మ సేద్య విస్తీర్ణం, ఉద్యాన పంట సాగు విస్తీర్ణం, ఉద్యాన పంట ఉత్పాదకతను పెంచడంపై ఉద్యాన శాఖ అధికారులు దృష్టిసారించాలన్నారు. జాతీయ ఆహార భద్రతా చట్టం పటిష్ట అమలు, ఎల్‌పీజీ, పీఎన్‌జీ కనెక్షన్లకు సంబంధించిన సూచికలు పౌర సరఫరాల శాఖ పరిధిలో వున్నట్లు వివరించారు. సమావేశంలో జిల్లా పరిశ్రమల అధికారి బి.సాంబయ్య, ఉద్యాన అధికారి పి.బాలాజీ కుమార్, పౌర సరఫరాల అధికారి ఎ.పాపారావు తదితరులు పాల్గొన్నారు.



అన్న క్యాంటీన్‌లో ఆకస్మిక తనిఖీ

కలెక్టరేట్ : అన్న క్యాంటీన్లలో నిర్వహణపరంగా ఎక్కడా లోటుపాట్లు లేకుండా నిరంతరం పర్యవేక్షిస్తున్నట్టు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ అన్నారు. గాంధీనగర్‌లోని అన్న క్యాంటీన్‌ను బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు. క్యాంటీన్‌లో ఆహార పదార్థాల నాణ్యతను అడిగి తెలుసుకున్నారు. క్యాంటీన్ పరిసరాలు శుభ్రంగా వుండాలని, సిబ్బందికి సూచించారు. మెనూ ప్రకారం ఆహార పదార్థాలను అందుబాటులో వుంచాలన్నారు. అన్ని క్యాంటీన్‌లలో అవసరమైన మౌలిక వసతులు కల్పించి నిర్వహణకు ప్రత్యేక ఇన్‌చార్జిలకు బాధ్యతలు అప్పగించడం జరిగిందన్నారు.

లక్నో పర్యటనలో నెట్టెం

- సహకార శిక్షణ కార్యక్రమాలకు హాజరు

జగ్గయ్యపేట: సహకారరంగంలో పాలన, నాయకత్వం, తాజా పరిణమాలపై అవగాహన కోసం ఉత్తరప్రదేశ్ రాజధాని లక్నోలో ఆప్కాబ్, జిల్లా సహకార కేంద్ర బ్యాంకుల చైర్మన్ల (పర్సన్ ఇన్‌చార్జ్‌లు)కు ఏర్పాటు చేసిన 3 రోజుల అవగాహన కార్యక్రమంలో కృష్ణా జిల్లా కేంద్ర సహకార బ్యాంకు అధ్యక్షుడు నెట్టెం రఘురాం పాల్గొన్నారు. తొలి రోజు నాయకత్వం, పాలనా సామర్థ్యం, పాలకవర్గాల బాధ్యతలపై శిక్షణ, రెండోరోజు లక్నోలో చేపల జన్యు పరిశోధన కేంద్రాన్ని సందర్శించి, అక్కడ జరుగుతున్న పరిశోధనలను తెలుసు కున్నారు. అయోధ్య డీసీసీబీని సందర్శించి అక్కడి బ్యాంకులో అనుసరిస్తున్న కార్యకలాపాలను తెలుసుకున్నారు.



జెడ్పీ చైర్‌పర్సన్ హారికను పరామర్శిస్తున్న వివిధ జిల్లాల చైర్‌పర్సన్లు

జెడ్పీ చైర్‌పర్సన్‌కు పలువురి పరామర్శ

పెడన రూరల్, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : జిల్లా పరిషత్ మహిళా చైర్‌పర్సన్ ఉప్పాల హారికను రోడ్డుపై అవమానపర్చటాన్ని వివిధ జిల్లా పరిషత్ చైర్మన్లు తీవ్రంగా ఖండించారు. కూడూరులో ఉప్పాల హారిక ఇంటికి బుధవారం తూర్పుగోదావరి, చిత్తూరు, అనంతపురం, ప్రకాశం, కడప, కర్నూలు, నెల్లూరు, విజయనగరం, విశాఖ, శ్రీకాకుళం చైర్మన్లు పరామర్శించారు. రాష్ట్రంలో రెడ్ బుక్ రాజ్యాంగం నడుస్తున్నదన్నారు. తప్పుడు కేసులు, అక్రమ అరెస్టులతో వైసీపీ నాయకులను కార్యకర్తలను భయపెట్టలేరని అన్నారు. రానున్నది తమ ప్రభుత్వమే అని కార్యకర్తలు గుర్తుంచుకోవాలన్నారు. పెడన నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జ్ ఉప్పాల రామును కలిసి పార్టీ అండగా ఉంటుందని తెలిపారు.

నిధులు గోల్‌మాల్!

(5వ పేజీ తరువాయి)

చేయించుకున్నాడు. కానీ రైతుల ఖాతాల్లో రుణాలు చెల్లించినట్లుగా చూపలేదు. దీంతో రైతులు అన్ని ఆధారాలతో అధికారులకు ఫిర్యాదు చేశారు. విచారణ చేసిన అధికారులు రూ.45లక్షల వరకు నగదు పక్కదారి పట్టినట్లుగా నిర్ధారించారు. ఏడాదిన్నర కాలంగా ఈ పీఏసీఎస్ కార్యదర్శి తప్పించుకు తిరుగుతున్నాడు. అయినా అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోలేదు.

నాగాయలంక పీఏసీఎస్‌లో ఎరువులు పక్కదారి పట్టడం, టి-కొత్తపాలెంకు చెందిన రైతులకు రుణాలు ఇచ్చిన రికార్డులు సక్రమంగా లేకపోవడం, క్యాష్‌బుక్‌లో దిద్దుబాట్లు ఉన్నట్లుగా అధికారుల విచారణలో వెల్లడైంది. అయినా ఇంతవరకు అక్రమార్కులపై చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. తరకటూరు, ముక్కొల్లు, గోకవరం, తదితర పీఏసీఎస్‌ల్లో జరిగిన అక్రమాలపై విచారణ పూర్తయ్యేదశలో ఉన్నాయని, విచారణ పూర్తయిన తర్వాత చర్యలు తీసుకుంటామని డీసీవో చంద్రశేఖరరెడ్డి తెలిపారు. రుణాలు చెల్లించే సమయంలో తప్పనిసరిగా కంప్యూటర్ నుంచి తీసిన ఒరిజినల్ రసీదును రైతులు అడిగి తీసుకోవాలని సూచించారు.



వివరాలు తెలియజేస్తున్న బాధితులు

అవినీతి ఉపాధ్యాయుడిని

శాశ్వతంగా తొలగించాలి

- బాధితుల ఆందోళన

ఘంటసాల, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : కోట్ల రూపాయల ప్రజల సొమ్మును స్వాహా చేసిన ఉపాధ్యాయుడు గద్దె శ్రీనివాసరావుపై శాశ్వత చర్యలు తీసుకోవాలని పలువురు బాధితులు డిమాండ్ చేశారు. శ్రీనివాస్‌కు నగదు ఇచ్చి మోసపోయిన పలువురు బాధితులు బుధవారం ఘంటసాలలో విలేకరుల సమావేశంలో తమ గోడును వెళ్లగక్కారు. చిట్టీలు, రియల్ ఎస్టేట్, వడ్డీల వ్యాపారం పేరుతో కోట్లాది రూపాయలు దండుకుని అదృశ్యమైన ఉపాధ్యాయుడు గద్దె శ్రీనివాసరావును 2024లో అప్పటి డీఈవో తాహెరా సుల్తానా సస్పెండ్ చేయగా, ప్రస్తుత డీఈవో రామారావు తిరిగి విధుల్లోకి తీసుకున్నారన్నారు. కమిటీ విచారణ జరగకుండా, రిపోర్టు ఇవ్వకుండా సస్పెన్షన్ ఎలా తొలగిస్తారని బాధితులు ప్రశ్నిస్తున్నారు. ఈదే విషయమై డీఈవోను కలిసి ప్రశ్నించగా సమాధానం చెప్పకుండా దాటవేసే ధోరణిని ప్రదర్శించారని తెలిపారు. స్టేషన్‌లో ఫిర్యాదు చేసినప్పటికీ విచారణ చేసిన దాఖలాలు లేవన్నారు. శ్రీనివాసరావును శాశ్వతంగా విధుల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో దోనేపూడి అహోబలరావు, వడ్లమూడి ప్రసాదరావు, పోతన వెంకటేశ్వరరావు, వేమూరి వెంకటేశ్వరరావు, వేమూరి వెంకటేశ్వరరావు, తలశిల రంగారావు, గొరిపర్తి రాజేష్, కె.కేశవ తదితరులు పాల్గొన్నారు.

తామర పూల కోసం వెళ్లి..

(5వ పేజీ తరువాయి)

నరసింహారావు స్థానిక పంచాయతీలో కార్మికుడిగా పని చేస్తున్నాడు. సతీష్ కొంచం అమాయకంగా ఉండటంతో ఇంటి వద్దనే ఉంచుతున్నారు. ఎవరికి తెలియకుండా వెళ్లి ఇలా చనిపోవడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరు అవుతున్నారు. చైతన్య కుమార్ తండ్రి దుర్గారావు తాపీ మేస్త్రిగా పని చేస్తున్నాడు. వీరికి లేకలేక చైతన్య కుమార్ పుట్టాడు. ఒక్కగానొక కొడుకు మృతి చెందటంతో బోరున విలపిస్తున్నారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బాబునే విమర్శించేంత గొప్పోడివా!

- రౌడీ రాజకీయాలు చేస్తే ప్రజలే నీకు తగిన బుద్ధి చెబుతారు
- పేర్ని నానిపై తెలుగు మహిళల ఆగ్రహం
- నాయుడిపేటలో చీపుర్లతో నిరసన ప్రదర్శన



రామానాయుడుపేట సెంటర్‌లో చీపుర్లు పట్టుకుని నిరసన తెలుపుతున్న తెలుగు మహిళలు

మచిలీపట్నం టౌన్, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : మాజీ ఎమ్మెల్యే అయివుండి ఇష్టం వచ్చినట్టు మాట్లాడటం పేర్ని నానికి సమంజసం కాదని, ప్రజలే అతడికి తగిన బుద్ధి చెబుతారని కృష్ణాజిల్లా తెలుగు మహిళ అధ్యక్షురాలు తలశిల స్వర్ణలత అన్నారు. పేర్ని నాని ఇంటి ముట్టడికి తెలుగు మహిళలు చీపుర్లతో వెళ్లారు. పోలీసులు అడ్డుకోవడంతో రామానాయుడుపేట సెంటర్‌లో తలశిల స్వర్ణలత ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, రేషన్ కుంభకోణంలో చిక్కుకున్న పేర్ని టీడీపీ నాయకులపై అవాకులు చెవాకులు పేలడం ఆశ్చర్యంగా ఉందన్నారు. కొల్లు నీలిమ మాజీ మంత్రి, దివంగత నడకుదిటి నరసింహారావు కుమార్తె, రవీంద్ర సతీమణి అని, కొల్లు ఫౌండేషన్ ద్వారా మానసిక దివ్యాంగులకు సేవలందించారన్నారు. ఇలాంటి మహిళపై పేర్ని నాని అవాకులు చవాకులు పేలడం దురదృష్టకరమన్నారు. కొడుకుతో చిల్లర రాజకీయాలు నేర్పిస్తున్నారన్నారు. రాష్ట్ర అభివృద్ధి కోసం అహర్నిశలు కష్టపడుతున్న సీఎం చంద్రబాబు, మంత్రులు నారా లోకేష్, కొల్లు రవీంద్రల జోలికి వెళితే ప్రజలే తగిన బుద్ధి చెబుతారన్నారు. కార్యక్రమంలో షైనేని ఇందిర, యార్లగడ్డ సుచిత్ర, పాలపర్తి పద్మజ, లంకిశెట్టి నీరజ, వసంతకుమారి, కొల్లు రమ్య, లతీవున్నీసా, లక్ష్మి, వాలిశెట్టి హైమావతి, కరెడ్ల సుశీల, అంకమ్మ, మాదాల సునీత, నూర్జహాన్‌తో పాటు తెలుగు మహిళలు పాల్గొన్నారు.

ఇక 6 లేన్లుగా..

(5వ పేజీ తరువాయి)

ఉండవని ఎన్‌హెచ్ పీడీ విద్యాసాగర్ 'ఆంధ్రజ్యోతి'కి చెప్పారు. విజయవాడలో బెంజిసర్కిల్ నుంచి మచిలీపట్నం వరకు ఎన్‌హెచ్ - 65 మొత్తం 68 కిలోమీటర్ల పొడవును కలిగి ఉంది. ఇందులో 57 కిలోమీటర్ల మేర ఆరు వరుసలుగా విస్తరిస్తారు.

విజయవాడలో విస్తరణ దాదాపు లేనట్టే!

68 కిలోమీటర్ల నిడివి కలిగిన విజయవాడ - మచిలీపట్నం ఎన్‌హెచ్ - 65ను 57 కిలోమీటర్ల మేర ఆరు వరుసలుగానూ, ఐదు కిలోమీటర్ల మేర సర్వీసు రోడ్లను అభివృద్ధి చే యనుండటంతో మొత్తంగా 62 కిలోమీటర్ల మేర విస్తరణ పనులు జరుగుతాయి. మరో ఆరు కిలోమీటర్ల పొడవునా ఎన్‌హెచ్ - 65 విజయవాడ నగరంలో ఉంటుంది. విజయవాడ నగరంలో ఎన్‌హెచ్ - 65ను విస్తరించాలంటే తేనె తుట్టెను కదిపినట్టే అవుతుంది. భూ సేకరణ జరపటం అంతా తేలిక కాదు. ఒకానొక దశలో విజయవాడ వరకు ఆరు కిలోమీటర్ల దూరంలో ఫ్లైఓవర్‌ను నిర్మించాలని కూడా ఎన్‌హెచ్ అధికారులు భావించారు. అయితే పెనమలూరు సెంటర్ నుంచి ఎన్‌హెచ్-65, బందరు రోడ్డు మీదుగా పీఎన్‌బీఎస్ వరకు మెట్రో రెండవ కారిడార్ వెళుతుంది. ఈ కారణంగా ఫ్లై ఓవర్ ప్రతిపాదనను ఎన్‌హెచ్ అధికారులు ఉపసంహరించుకున్నారు. విజయవాడ నగరంలో ఎన్‌హెచ్- 65 విస్తరణ అనేది దాదాపుగా లేనట్టే. భవిష్యత్తులో ఇన్నర్, అవుటర్ రింగ్ రోడ్లకు అనుసంధానం అవుతుంది కాబట్టి విజయవాడలో విస్తరణ అవసరం లేదన్న అభిప్రాయంతో ఎన్‌హెచ్ అధికారులు ఉన్నారు.

గొల్లపూడి వరకు ఆరు వరుసలు

(5వ పేజీ తరువాయి)

విస్తరణ పేరు చెబుతూ అమరావతి ఓఆర్ఆర్ వరకు అంటే కుదరదని తేల్చి చెప్పారు. విజయవాడ పశ్చిమ బైపాస్ అనుసంధానమయ్యే చోట గొల్లపూడి వరకు పొడిగించాల్సిందేనని స్పష్టం చేశారు. దీనిపై కేంద్ర ఉపరితల రవాణా మంత్రిత్వ శాఖ అధికారులు, ఎన్‌హెచ్ ఉన్నతాధికారుల దృష్టికి కూడా తీసుకువెళతానని చెప్పారు. ఆ తర్వాత తెలంగాణ ఎన్‌హెచ్ అధికారులు అలైన్‌మెంట్ పొడిగింపునకు సంబంధించి ఎంపీ చిన్నిని లేఖ కోరటం జరిగింది. యుద్ధ ప్రాతిపదికన ఎంపీ లేఖ పంపారు. ఈ లేఖ కేంద్రం పెద్దల దగ్గరకు చేరింది. ఎంపీ కేశినేని చిన్ని ప్రతిపాదన మేరకు మరో ఆలోచన కూడా లేకుండా వెంటనే మోర్తు కార్యదర్శి ఆమోదం తెలిపారు. దీంతో హైదరాబాద్ - విజయవాడ ఆరు వరుసల విస్తరణ గొల్లపూడి వరకు పొడిగించటం జరిగింది. దీంతో గొల్లపూడిలో అతి పెద్ద జంక్షన్ ఏర్పాటు కాబోతోంది. విజయవాడ ఎన్‌హెచ్ అధికారులు ఇక్కడ సర్కిల్ జంక్షన్ అభివృద్ధి చేయాలని నిర్ణయించారు. హైదరాబాద్ - విజయవాడ ఎన్‌హెచ్ - 65 ఆరు వరుసల విస్తరణ గొల్లపూడి వరకు వస్తుంది కాబట్టి, ఇక్కడ క్లోవర్ లీఫ్ జంక్షన్‌ను అభివృద్ధి చేసే అవకాశం కూడా కనిపిస్తోంది. దీనిపై తెలంగాణ ఎన్‌హెచ్ అధికారులు నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.



ఉపాధి హామీ నిధులతో ఉద్యాన పంటలు: సబ్ కలెక్టర్ చైతన్య

విజయవాడ రూరల్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం ద్వారా చిన్న, సన్నకారు రైతులు ఉచితంగా ఉద్యాన పంటలు పండించుకోవచ్చని విజయవాడ సబ్ కలెక్టర్ చైతన్య అన్నారు. నున్నలో బుధవారం ఉపాధి హామీ పథకం ద్వారా పండ్ల తోటల పెంపకంపై అవగాహన సదస్సు జరిగింది. ఈ కార్యక్రమానికి సబ్ కలెక్టర్ చైతన్య ముఖ్య అతిథిగా హాజరై పండ్ల తోటలు సాగుచేసే రైతులతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం పండ్ల తోటలు సాగు చేసే రైతులకు ఉచితంగా పంటలు వేసుకునే అవకాశం కల్పించిందని చిన్న, సన్నకారు, ఐదు ఎకరాలలోపు పొలం ఉన్న రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. పూర్తి వివరాలకు గ్రామ సచివాలయాల్లోని అగ్రికల్చర్, హార్టీకల్చర్ సిబ్బందిని సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో విగ్గిన్స్, ఏవో రఘురామ్ శ్రీనివాస్, ఉద్యానవన అధికారి పరమేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తాడిగడప మునిసిపాలిటీని అభివృద్ధి చేస్తా

ఎమ్మెల్యే బోడె ప్రసాద్

పెనమలూరు, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : రానున్న నాలుగేళ్ల కాలంలో తాడిగడప మునిసిపాలిటీని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ హామీ ఇచ్చారు. బుధవారం పోరంకి 8వ డివిజన్ సాయినగర్‌లో జరిగిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో టీడీపీ మునిసిపాలిటీ అధ్యక్షుడు అనుమోలు ప్రభాకరరావుతో కలిసి పాల్గొని స్థానికుల సమస్యలను విని పరిష్కారం చూపించారు. మునిసిపాలిటీలో ప్రధానంగా యుద్ధప్రాతిపదికన అభివృద్ధి చేయాల్సిన రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణాలు, మరమ్మతులపై దృష్టి సారించామని తెలిపారు. ఏడాది పాలనలో అభివృద్ధిని వివరించే కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో శొంఠి శివరాంప్రసాద్, మంచినేని పరమేశ్, యాళ్ల చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.



పోరంకి సాయినగర్‌లో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే బోడె ప్రసాద్, అనుమోలు ప్రభాకరరావు

దోమల వ్యాప్తికి చెక్ పెడతాం

తాడిగడప మునిసిపాలిటీలో దోమల వ్యాప్తికి చెక్ పెడతామని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. బుధవారం పోరంకి టీడీపీ కార్యాలయంలో రూ. 20లక్షలతో ఏర్పాటు చేసిన ఫాగింగ్ యంత్రాలను మునిసిపల్ అధికారులకు అందిస్తూ మాట్లాడారు. కానూరు, యనమలకుదురు, పోరంకి తదితర ప్రాంతాల్లో దోమల వ్యాప్తి విపరీతంగా ఉంటోందని, వాటి వ్యాప్తిని నిరోధించేందుకు ఫాగింగ్ చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలిపారు. మునిసిపాలిటీలో ఖాళీ స్థలాల యజమానులు స్థలాల్లో మెరక పోసుకొని నీటి నిల్వ లేకుండా చూడాలని, చెట్లు పెరగకుండా నిరోధించి సహకరించాలని కోరారు. ఖాళీ స్థలాల యజమానులు ఖాళీ స్థలాలను అలా వదిలివేయకుండా ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకొని దోమల వ్యాప్తిని నిరోధించే కార్యక్రమంలో పాలుపంచుకోవాలని కోరారు. కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ షేక్ నజీర్, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.



ఉయ్యూరు 10వ వార్డులో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో వైవీబీ రాజేంద్రప్రసాద్

చంద్రబాబుకు అండగా నిలవాలి: వైవీబీ

ఉయ్యూరు: కూటమి ప్రభుత్వంపై వైసీపీ అధినేత, నాయకులు చేస్తున్న దుష్ప్రచారం నమ్మవద్దని, ముఖ్యమంత్రి చంద్రబాబుకు అండగా నిలచి సంక్షేమ, అభివృద్ధి పథకాలు కొనసాగించేందుకు తోడ్పడాలని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వైవీబీ రాజేంద్రప్రసాద్ అన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా బుధవారం ఉయ్యూరు 10వ వార్డులో పర్యటించి చంద్రబాబు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ఇంటింటా తెలియజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, సామాజిక పింఛను పెంపు, తల్లికి వందనం, దీపం పథకం కింద ఉచితంగా మూడు వంట గ్యాస్ సిలెండర్లు అందజేస్తున్నారని , ఆగస్టు 15 నుంచి మహిళలకు ఆర్టీసీ బస్సులలో ఉచిత ప్రయాణం, రైతులకు అన్నదాత సుఖీభవ కింద సాగుకు ఆర్థిక సాయం అందజేయనున్నారని తెలిపారు. మాజీ చైర్మన్ ఖుద్దూస్, వార్డు కౌన్సిలర్ శ్రీనివాసరావు, పార్టీ నాయకులు వాసు, వెంకటేశ్వరరావు, పణి, అజ్మతుల్లా మాధవి, వెంకటలక్ష్మి పాల్గొన్నారు.



బండారుగూడెం గ్రామ సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు

అభివృద్ధి, సంక్షేమం కూటమి లక్ష్యం

ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు

హనుమాన్‌జంక్షన్‌రూరల్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి, సంక్షేమంలక్ష్యంగా కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. బండారుగూడెంలో బుధవారం నిర్వహించిన సుపరిపాల నలో తొలి అడుగు కార్యక్రమంలో స్థానిక సమస్యలను అడిగితెలుసుకున్నారు. ఏడాది కాలంలో ప్రభుతం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలతో రూపొందిం చిన కరపత్రాలను పంపిణీ చేశారు. మహిళలు హారతులిచ్చి ఘనస్వాగతం పలుకగా, అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వివిధ సంక్షేమ పథకాల లబ్ధిదారులతో, రైతులు, రైతు కూలీలతో ముఖాముఖి నిర్వ హించి ప్రభుత్వ పనితీరు గురించి ఆరా తీశారు. గ్రామంలో రూ.17లక్షల వ్య యంతో నిర్మించిన సీసీ రహదారిని, రూ.43.60లక్షల వ్యయంతో నిర్మించిన సచి వాలయ భవనాన్ని, రైతు సేవా కేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు దయాల రాజేశ్వరరావు, పుట్టా సురేష్, ఆళ్ల గోపాలకృష్ణ, మూల్పూరి సాయికళ్యాణి, గండేపూడి నితీష్, కొండేటి నాగరాజు, బేతాళ మాణిక్యాలరావు, పొనుగుమాటి చంటి, పామర్తి ప్రభాకరరావు, నాగరాజు, వేగిరెడ్డి పాపారావు, ఆరేపల్లి వెంకటేశ్వరరావు, కాటూరి విజయభాస్కర్, కొమ్మారెడ్డి రాజేష్ పాల్గొన్నారు.

పదవికి వన్నె తెచ్చేలా పనిచేయాలి

గన్నవరం: జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ సభ్యుడిగా గన్నవరం ఎస్సీ కాలనీకి చెందిన తిరివీధి నరేష్ నియమితులయ్యారు. బుధవారం టీడీపీ టౌన్ అధ్యక్షుడు జాస్తి శ్రీధర్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావును కలసి పూల బొకే అందజేసి దుశ్శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు మాట్లాడుతూ, ఇచ్చిన పదవికి వన్నె తెచ్చేలా పని చేసి మంచి పేరు తెచ్చుకోవాలని సూచించారు. చిమట శ్రీనివాసరావు, మోదుగుమూడి వేణు, పఠాన్ ఆసిఫ్‌ఖాన్, తిరివీధి వినోదరావు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్ల బిగింపు వెంటనే ఆపాలి: సీపీఐ



మాట్లాడుతున్న సీపీఐ ఏరియా కార్యదర్శి కాట్రగడ్డ రామచంద్ర జోషి

గన్నవరం, జూలై 16 (ఆంధ్రజ్యోతి): స్మార్ట్ మీటర్లు బిగింపును వెంటనే నిలిపివేయాలని సీపీఐ ఏరియా కార్యదర్శి కాట్రగడ్డ రామచంద్ర జోషి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక సీపీఎం కార్యాలయంలో స్మార్ట్ మీటర్ల ఏర్పాటుపై వామపక్షాల ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జోషి మాట్లాడుతూ ట్రూ ఆఫ్ చార్జీలు ఇందన సర్దుబాటు చార్జీలు రద్దు చేయాలన్నారు. సీపీఎం మండల కార్యదర్శి మల్లంపల్లి ఆంజనేయులు మాట్లాడుతూ జగన్, చంద్రబాబు మోదీకి దాసోహం అయ్యారని ఆరోపించారు. స్మార్ట్ మీటర్లు పేదలకు పెనుభారంగా మారుతుందన్నారు. స్మార్ట్ మీటర్ల వల్ల కలిగే ప్రమాదాన్ని ప్రజలకు వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి బెజవాడ తాతబ్బాయి, సీపీఎం నాయకులు అనుమోలు వెంకటేశ్వరావు, సిహెచ్ రాజేశ్వరరావు, సూరగని సాంబశివరావు, రామకృష్ణ, బాబా వల్లి, బడుగు మరియ దాసు, సాంబయ్య, సీపీఐ నాయకులు కట్టవరపు విజయరావు, మోహన్ రావు, వెంగళ శివయ్య, నందం బసవేశ్వరావు, కట్టవరపు బెనర్జీ తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసరాల అందజేత




గన్నవరం, జూలై 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎస్సీ కాలనీలో అనారోగ్య కారణాల రీత్యా మృతి చెందిన తిరివీధి మిషక్ కుటుంబాన్ని పీఆర్‌కె ఫౌండేషన్ చైర్మన్ పారా రామకృష్ణ బుధవారం పరామర్శించారు. రైస్ బ్యాగ్‌లు, నిత్యవసర సరుకులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆపదలో ఉన్నవారిని ఆదుకోవటం బాధ్యత అన్నారు. సర్పంచ్ నిడమర్తి సౌజన్య, టీడీపీ నాయకుడు తంగిరాల శ్రీనివాసరావు, నిడమర్తి నాగేశ్వరరావు, వల్లూరి చక్రవర్తి, వనం నాగేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.



గన్నవరంలో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న న్యాయవాదులు

కేసులు రాజీ చేసుకోవాలి

గన్నవరం, జూలై 16 (ఆంధ్రజ్యోతి): మధ్యవర్తిత్వంతోనే కేసులు రాజీ చేసుకోవాలని మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ డాక్టర్ అరుణశ్రీ అన్నారు. స్థానిక సీనియర్ సివిల్ జడ్జి కోర్టు ప్రాంగణం నుంచి బుధవారం మధ్యవర్తిత్వం, దేశం కోసం కార్యక్రమంలో భాగంగా బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి డాక్టర్ అరుణ శ్రీ మాట్లాడుతూ ఇరు పార్టీలకు మధ్యవర్తిత్వం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించాలన్నారు. రోజురోజుకు పెరుగుతున్న కేసులు, కోర్టుల్లో పెండింగ్ కేసులను తగ్గించేందుకే సుప్రీం కోర్టు మధ్యవర్తిత్వం-దేశం కోసం కార్యక్రమాన్ని నిర్వహిస్తుందన్నారు. న్యాయవాదులు, కోర్టు సిబ్బంది, పోలీసులు పాల్గొన్నారు.



టెన్త్‌లో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న డైట్ ప్రిన్సిపాల్ ఆంజనేయులు

టెన్త్‌లో నూరుశాతం ఉత్తీర్ణత సాధించాలి

కంకిపాడు, జూలై 16 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది టెన్త్‌లో నూరుశాతం ఉత్తీర్ణత సాధించాలని అందుకు ఉపాధ్యాయులు పక్కా ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని డైట్ ప్రిన్సిపాల్ ఆంజనేయులు అన్నారు. మండలంలోని పునాదిపాడు జెడ్పీ పాఠశాలలో బుధవారం టెన్త్, ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గత ఏడాది పునాదిపాడు పాఠశాలలో టెన్త్ పరీక్షల్లో కేవలం 61శాతం ఉత్తీర్ణత సాధించారని, అయితే ఈ ఏడాది వందశాతం ఉత్తీర్ణ సాధించేలా విద్యార్థులు, ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. ఒకసారి చెప్పింది అర్థం కాకపోతే విద్యార్థులు ఉపాధ్యాయులను మళ్లీ అడిగి తెలుసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో నత్తా వెంకటేశ్వరరావు, పిడికిటి, బిచ్చియ్య బాబు, ప్రకాశం, శ్రీరామ్, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులు తయారు చేసిన విద్యుత్ వాహనంతో అధ్యాపకులు

ధనేకులలో ముగిసిన వర్క్‌షాప్

పెనమలూరు, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : గంగూరు ధనేకుల ఇంజనీరింగ్ కళాశాలలో మూడు రోజుల పాటు జరిగిన ఈవెహికిల్ డిజైన్ అండ్ డెవలప్‌మెంట్ వర్క్‌షాపు బుధవారంతో ముగిసింది. కళాశాల ఈసీఈ, డైట్ ఐఎస్ఎఫ్, ఐఈటీఈ స్టూడెంట్ ఛాప్టర్, బిస్ట్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ వారు సంయుక్తంగా నిర్వహించిన ఈ వర్క్‌షాపులో మొదటి రెండు రోజులు విద్యార్థులు మాత్‌ల్యాబ్, సిములింక్ వంటి టూల్స్ ద్వారా పవర్ కన్వర్టర్‌లు, మోటార్లు, బ్యాటరీ మోడలింగ్ లాంటి అంశాలపై శిక్షణ పొందారు. చివరి రోజున విద్యుత్ వాహనం పూర్తిస్థాయి మోడల్‌ను వర్క్‌షాపు నిపుణుల సాయంతో అసెంబ్లింగ్ చేశారు. విద్యార్థులు నిపుణుల సహకారంతో 650 కిలోల పేలోడ్, ఆరుగురు ప్రయాణికుల సామర్థ్యం ఉన్న విద్యుత్ వాహనాన్ని విజయవంతంగా రూపొందించారు. ఈ సంద్భంగా ఈసీఈ హెచ్‌ఓడీ డాక్టర్ వంశీకృష్ణ మాట్లాడుతూ విద్యుత్ వాహనాల ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో చైర్మన్ ధనేకుల రవీంద్రనాధ్ ఠాగూర్, కరస్పాండెంటు ధనేకుల భవానీ ప్రసాద్, డైరెక్టర్ రవిప్రసాద్, ప్రిన్సిపాల్ డాక్టర్ రవి కడియాల పాల్గొన్నారు.



రోటరీ క్లబ్‌కు విరాళం చెక్కు అందజేస్తున్న చంద్రమోహన్

రోటరీ క్లబ్‌కు రూ. 50వేల విరాళం

ఉయ్యూరు, జూలై 16 (ఆంధ్రజ్యోతి): ఉయ్యూరు రోటరీ క్లబ్‌కు సీనియర్ వైద్యుడు పిన్నమనేని చంద్రమోహన్ రూ. 50వేలు విరాళం అందజేశారు. 2025- 2026 సంవత్సరానికి క్లబ్ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం సందర్భంగా రామకృష్ణరిక్రియేషన్ క్లబ్ ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడిగా రెండవసారి ఎంపికైన చొప్పరపు నాగసుబ్రమణ్యంకు క్లబ్ జిల్లా అసిస్టెంట్ గవర్నర్ ఎం.రమణమూర్తి సమక్షంలో చంద్రమోహన్ విరాళం చెక్కు అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కేసీపీ ఉద్యోగులు, రైతులు, యాజమాన్యం, సమష్టికృషితో కేసీపీ చక్కెర కర్మాగారానికి, రోటరీ క్లబ్‌కు పూర్వవైభవం తీసుకువచ్చి మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టాలని ఆకాంక్షించారు. కేసీపీ కేన్ జీఎం పున్నారావు, క్లబ్ సెక్రటరీ అమీర్ మీర్జా, డాక్టర్ తిరుమల రావు, మాజీ అసిస్టెంట్ గవర్నర్ సంపత్‌కుమార్, పులి శ్రీనివాసరావు, అనీస్ తదిరులు పాల్గొన్నారు.

కుల నిర్మూలన పోరాట సమితి

సదస్సును జయప్రదం చేయండి

కానూరు, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : కులనిర్మూలనా పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు దుడ్డు ప్రభాకర్‌ను వెంటనే విడుదల చేయా లని కోరుతూ ఈ నెల 19న ఒంగోలు పట్టణంలో జరిగే కుల నిర్మూలన పోరాట సమితి రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని సమితి కృష్ణాజిల్లా అధ్యక్షుడు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తుమాటి శ్రీరాములు విజ్ఞప్తి చేశారు. బుధవారం ఆయన కానూరులో విలేకరులతో మా ట్లాడుతూ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ భవన్‌లో జరిగే ఈ సదస్సుకు వక్తలుగా హైకోర్టు రిటైర్డ్ జడ్జి జస్టిస్ బి. చంద్రకుమార్, డాక్టర్ ఎంఎఫ్ గోపీనాథ్, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె. రామకృష్ణతోపాటు పలువురు నేతలు పాల్గొంటారని పేర్కొన్నారు. రెండేళ్ల క్రితం దుడ్డు ప్రభాకర్‌ను ఎన్ఐఏ పోలీసులు అక్రమ కేసులలో అరెస్టు చేశారని చెప్పారు. కోర్టుల్లో బెయిల్ రాకుండా పోలీసులు అడ్డుకుంటున్నారని, ప్రభాకర్‌తోపాటు పలు జైళ్లలో మగ్గుతున్న ఆదివాసీలు, ప్రజాస్వా మిక వాదులను, ఉద్యమకారులను బేషరతుగా విడుదల చేయాలని ఆయన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు.



ఎరువుల దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు

పెనమలూరు, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : పెనమలూరు, పోరంకి, కానూరు గ్రామాల్లోని పలు ఎరువుల దుకాణాల్లో విజిలెన్సు, వ్యవసాయాధికారులు బుధవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. దుకాణాల్లోని స్టాక్ రిజిస్టర్లు వెరిఫై చేసి ఫార్మ్-0 లేనివి స్టాప్ సేల్‌గా ప్రకటించారు. తనిఖీల్లో విజిలెన్సు డీఎస్పీ బంగార్రాజు, అగ్రికల్చరల్ ఏడీఏ చంద్రశేఖర్, మండల ఏవో శైలజ, టెక్నికల్ ఏవో లంక శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పోరంకి పీఏసీఎస్ చైర్‌పర్సన్‌గా మంచినేని పరమేశ్ బాధ్యతల స్వీకారం



పెనమలూరు, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల ఏపీ ప్రభుత్వం ప్రకటించిన పోరంకి పీఏసీఎస్ చైర్‌పర్సన్‌గా మంచినేని పరమేశ్, డైరెక్టర్లుగా జరుగు రాజా, పోసుబోయిన రవిలు బుధవారం ప్రమాణ స్వీకారం చేశారు. ఈసందర్భంగా పరమేశ్ మాట్లాడుతూ, వ్యవసాయ సహకార పరపతి సంఘం ద్వారా రైతులకు మెరుగైన సేవలు అందిస్తామని హామీ ఇచ్చారు. స్థానిక ఎమ్మెల్యే బోడె ప్రసాద్, టీడీపీ తాడిగడప మునిసిపాలిటీ అధ్యక్షుడు అనుమోలు ప్రభాకరరావు పరమేశ్‌ను ఘనంగా సత్కరించి అభినందించారు.

విద్యుత్ విజిలెన్స్ అధికారుల ఆకస్మిక తనిఖీలు

- 124 కేసులు నమోదు.. రూ. 4.08 లక్షల అపరాధ రుసుం..
- ఆటోనగర్ సెక్షన్‌లో 38 బృందాలు తనిఖీలు

కానూరు, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : గుణదల డివిజన్ పరిధిలోని ఆటోనగర్ సెక్షన్‌లో బుధవారం విద్యుత్‌శాఖ విజిలెన్స్, ఆపరేషన్ అధికారులు 38 బృందాలుగా ఏర్పడి ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో 124 కేసులు నమోదుచేసి రూ. 4.08 లక్షలు అపరాధ రుసుంగా విధించారు. ఇందులో అధికంగా వాడుకుంటున్న విద్యుత్ లోడ్‌తోపాటు ఒక కేటగిరీ నుంచి ఇంకొక కేటగిరీకి వాడుకుంటున్న సర్వీస్‌లు, అలాగే తక్కువగా బిల్లు వస్తున్న సర్వీస్‌లను కూడా గుర్తించి క్రమబద్ధీకరణకు నోటీసులను జారీ చేశారు. కాగా ఈదాడులకు ముందు ఏర్పాటు చేసిన సమావేశంలో డివిజన్‌లోని లైన్‌మెన్‌లు, లైన్ ఇన్‌స్పెక్టర్‌లకు వారి విధులు, బాధ్యతలు, ఫీల్డ్‌లో లైన్‌లు పనిచేసే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను గురించి అధికారులు వివరించారు. ఈ దాడుల్లో ఎన్టీఆర్ సర్కిల్ ఎస్ఈ శ్రీనివాసరావు, విజిలెన్స్ ఎస్ఈ విజయకృష్ణ, గుణదల డివిజన్ ఈఈ పి. హరిబాబు, విజిలెన్స్ ఈఈ పి. విజయకుమారి, డీఈఈ శివకుమార్, ఆటోనగర్ ఏఈ ఏడుకొండలు ఇతర అధికారులు పాల్గొన్నారు.



నీలాకాశం

గత కొన్ని రోజులుగా మేఘాల కదలిక మందగించడంతో సూరీడు సుర్రుమనిపిస్తున్నాడు. ఎంచక్కా జూలై వచ్చేసింది.. వర్షాలతో ఉపశమనం పొందుదామనుకున్న వారి ఆశలను అడియాశలు చేస్తూ భానుడు భగ్గుమంటున్నాడు. దీంతో విజయవాడలో విపరీతమైన వేడిగాలులు ఆవహించాయి. వేసవిని తలపిస్తున్న నగరంలోని వాతావరణం సాయంత్రానికి కొంచెం చల్లబడింది. అంతలోనే ఎవరో పిలిచినట్టు తుర్రుమన్నాయి. మేఘాలు కదలాడిన ఆ కాసేపు ఆకాశం నీలిరంగు పరుచుకుని కనువిందు చేసింది.





హనుమాన్‌జంక్షన్ పోలీస్ స్టేషన్‌లో రిజిస్టరులో ఎస్సై ఎదుట సంతకం చేస్తున్న వంశీమోహన్

వంశీ అనుచరులకు పోలీసుల చెక్

● జంక్షన్ పోలీస్ స్టేషన్‌లో వంశీ ఒక్కడికే అనుమతి

హనుమాన్‌జంక్షన్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ అనుచరులకు జంక్షన్ పోలీసులు బుధవారం చెక్ పెట్టారు. నకిలీ ఇళ్లపట్టాల కేసులో ముద్దాయిగా ఉన్న వంశీ కోర్టు షరతులు మేరకు ప్రతి బుధ, శనివారం జంక్షన్ పోలీస్ స్టేషన్ రిజిస్టరులో సంతకం పెట్టడానికి హాజరవుతున్న విషయం తెలిసిందే. ఈ సందర్భంగా ఆయన అభిమానులు, కార్యకర్తలు, నేతలు పోలీస్ స్టేషన్ ఆవరణలో పెద్ద ఎత్తున చేరి వంశీని పరామర్శిస్తున్నారు. దీంతో పోలీస్ స్టేషన్ వైసీపీ కార్యకర్తలకు వంశీని కలుసుకునే కేంద్రంగా మారిందన్న విమర్శలకు గురైంది. ప్రజలు పోలీసుల తీరును తప్పుపడుతున్నారన్న విషయాన్ని గ్రహించిన ఎస్సై సురేష్ బుధవారం వంశీ అనుచరులు పోలీస్ స్టేషన్ ఆవరణలోకి రాకుండా చర్యలు తీసుకున్నారు. వంశీతో పాటు మరో వ్యక్తిని మాత్రమే లోపలికి రావడానికి అనుమతిచ్చారు. నేతలు, కార్యకర్తలను మెయిన్ గేటు వద్దే నిలిపేశారు. వంశీ ఒక్కరే వెళ్లి ఎస్సై కేబిన్‌లో రిజిస్టరులో సంతకం పెట్టి వెళ్లారు.

ఎక్సైజ్ కానిస్టేబుల్‌కు పవర్‌లిఫ్టింగ్‌లో బంగారు పతకం



గుణదల, జూలై 16 (ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయిలో జరిగిన పవర్‌లిఫ్టింగ్ పోటీల్లో బంగారు పతకం కైవసం చేసుకున్న ఎక్సైజ్ కానిస్టేబుల్ భవిష్యత్‌లో మరిన్ని పతకాలు కైవసం చేసుకోవాలని ఆకాంక్షిస్తున్నట్టు ఎక్సైజ్‌శాఖ డైరెక్టర్ నిశాంత్ కుమార్ తెలిపారు. జూన్ నెల 27 నుంచి 30 వరకు కర్నాటకలోని దేవగిరిలో జరిగిన సీనియర్ పవర్‌లిఫ్టింగ్ పోటీల్లో నగరంలోని ఎక్సైజ్‌శాఖలో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న ఎస్ చంద్రకళ పాల్గొన్నారు. 4 రోజుల పాటు జరిగిన సీనియర్ నేషనల్ పవర్‌లిఫ్టింగ్ పోటీల్లో తలపడేందుకు దేశంలోని అన్ని రాష్ట్రాల నుంచి క్రీడాకారులు హాజరయ్యారు. సీనియర్ నేషనల్ పవర్‌లిఫ్టింగ్ చాంపియన్‌షిప్‌లో 75 కేజీల విభాగంలో నగరం నుంచి తలపడిన ఎక్సైజ్ కానిస్టేబుల్ ఎస్ చంద్రకళ బంగారు పతకం కైవసం చేసుకుంది. బుధవారం ఈమె ఎక్సైజ్ డైరెక్టర్ నిశాంత్ కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిసింది. ఈ ఏడాది టర్కీలో జరగనున్న అంతర్జాతీయ పవర్‌లిఫ్టింగ్ పోటీల్లోనూ పాల్గొని ఇదే స్ఫూర్తితో మరో పతకంతో తిరిగి రావాలని కోరుకుంటున్నట్టు నిశాంత్ కుమార్ తెలిపారు. అటు ఉద్యోగం చేస్తూనే క్రీడల్లో ప్రతిభ కనబరుస్తున్న కానిస్టేబుల్ చంద్రకళను ఆయన అభినందించారు.



అవార్డు అందుకున్న వెంకటరత్నం

ఆదూరికి సాహితీరంగంలో అవార్డు

విజయవాడ, జూలై 16 (ఆంధ్రజ్యోతి): సాహిత్యం రీసెర్చ్ అండ్ పబ్లికేషన్ రంగాల్లో సేవలకుగాను దళిత్ ఓపెన్ వర్సిటీ ఆఫ్ ఇండియా అంబేడ్కర్ జాతీయ అవార్డును ఎంఈవో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఆదూరి వెంకటరత్నం అందుకున్నారు. ఏసీ కాలేజీలో అధ్యాపకుడిగా పనిచేసిన రంజన్‌బాబు స్థాపించిన యూనివర్సిటీ 39వ స్నాతకోత్సవం సందర్భంగా ఆయన ఈ అవార్డుకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ ఇప్పటివరకు అందుకున్న అవార్డులతో పాటు ప్రతిష్టాత్మకమైన అంబేడ్కర్ జాతీయ అవార్డు అందుకోవడం సంతోషానిచ్చిందన్నారు.

ముగిసిన ఇంజనీరింగ్ ప్రత్యేక కేటగిరీ కౌన్సెలింగ్

భారతీనగర్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ఇంజినీరింగ్ కళాశాలల్లో ఎంసెట్ ర్యాంక్ ఆధారంగా వివిధ కోర్సుల ప్రవేశానికి సంబంధించి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహిస్తున్న ప్రత్యేక కేటగిరి కౌన్సెలింగ్ బుధవారంతో ముగిసింది. బుధవారం 218 మంది మందికి సర్టిఫికెట్లు వెరిఫికేషన్ చేసినట్టు కళాశాల ప్రిన్సిపల్ ఎం. విజయసారథి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కౌన్సెలింగ్‌లో ఆర్మీ విభాగంలో 28 మందికి, స్పోర్ట్సు అండ్ గేమ్స్ విభాగంలో 61 మందికి, పీడబ్ల్యూ (వికలాంగులు) విభాగం 129 మందికి మొత్తం 218 మందికి సర్టిఫికెట్లు వెరిఫికేషన్ చేయించుకున్నట్టు తెలిపారు.

హారిక ఉదంతంపై జగన్ అసత్యాలు

ఆంధ్రజ్యోతి, గుడివాడ: కృష్ణాజిల్లా పరిషత్ చైర్మన్ ఉప్పాల హారికపై టీడీపీ సైకోలు దాడి చేశాయంటూ మాజీ ముఖ్యమంత్రి జగన్ అలవోకగా అబద్ధాలు అల్లేశారు. బుధవారం ఆయన తన ప్రెస్‌మీట్‌లో గుడివాడ అంశాన్ని, హారిక ఉదంతాన్ని ప్రస్తావించారు. తన ప్రస్తావనలో వాస్తవాలను పక్కన పెట్టి జగన్ చేసిన ప్రచారం తీవ్ర విమర్శల పాలౌతోంది. వైసీపీ కార్యకర్తలను ఉన్మాదులుగా తయారు చేసి టీడీపీ నేతలను చీకట్లో నరికేయమని ప్రేరేపించిన పేర్ని నానిని అడ్డుకునేందుకు టీడీపీ శ్రేణులు వచ్చిన మాట వాస్తవమే. పేర్ని నాని కారు కాదని తెలుసుకున్నాక అడ్డుతగల్లేదు. కానీ జడ్పీ చైర్మన్ భర్త ఉప్పాల రాము బూతు పురాణం అందుకున్నారు. టీడీపీ శ్రేణులను బూతులు తిడుతూ రెచ్చగొట్టారు. దీంతో మాటామాటా పెరిగిందే తప్ప వారిపై దాడి జరగలేదు. పైగా పోలీసులు వచ్చి దారి ఉంది వెళ్లిపొమ్మనమని చెప్పినా వెళ్లకుండా కావాలనే వివాదం సృష్టించాడు. టీడీపీ శ్రేణులు ఎంతో సంయమనంగా ఉన్నా హారిక, రాము రెచ్చగొట్టారు. ఒక్క టీడీపీ కార్యకర్త వద్ద కూడా కర్రలు లేవు. కానీ జగన్ మాత్రం హారికపై భయంకరమైన దాడి జరిగినట్టు ప్రచారం చేశారు.



బాధితులకు ఎల్‌వోసీలు అందజేస్తున్న ఎంపీ శివనాథ్

జగన్ అంటే ఒక విధ్వంసం, వినాశనం

విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని)

వన్‌టౌన్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): వైఎస్ జగన్ అంటే ఒక విధ్వంసం, వినాశనమని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) అన్నారు. బుధవారం గురునానక్ నగర్‌లోని తన కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. జగన్ తన పాలనలో ఏ రోజున ప్రజల అభివృద్ధిని పట్టించుకోలేదన్నారు. అభివృద్ధి, సంక్షేమం లక్ష్యంగా ముందుకెళుతున్న కూటమి ప్రభుత్వంపై జగన్ విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. చంద్రబాబు పాలనలో రాష్ట్ర ప్రజలు సంతోషంగా ఉన్నారన్నారు. సుపరిపాలనలో తొలి అడుగులో భాగంగా ఇంటింటికీ వెళుతున్న ప్రజా ప్రతినిధులతో ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారన్నారు. ఉనికి కోసం ఐదు రోజులకోసారి ప్రెస్ మీట్లు పెట్టడం, ప్రభుత్వంపై విమర్శలు గుప్పించడం అలవాటుగా మారిందన్నారు. జగన్ రెడ్డి ఎప్పటికీ అధికారంలోకి రాకూడదనే ప్రజలు 11 సీట్లకే పరిమితం చేశారని, ఈసారి అవి కూడా దక్కవన్నారు.

లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు

ముఖ్యమంత్రి సహాయనిధి బాధిత కుటుంబాలకు ఎంతో సహకారిగా నిలుస్తుందని ఎంపీ శివనాథ్ అన్నారు. బుధవారం విజయవాడ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన సీఎంఆర్‌ఎఫ్ నిధి రూ.52.28 లక్షల చెక్కులను 46 మంది బాధితులకు ఆయన తన కార్యాలయంలో అందజేశారు. ఇప్పటివరకు రూ.2కోట్లను 168 మంది బాధితులకు తన కార్యాలయం ద్వారా అందించినట్లు తెలిపారు. బాధితులకు సకాలంలో చెక్కులందేలా చర్యలు తీసుకుంటున్న సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, మంత్రి లోకేశ్‌కు, బీజేపీ నాయకత్వానికి ఆయన ధన్యవాదాలు తెలిపారు. వివిధ హోదాలున్న నేతలు కంచి రఘుప్రవీణ్, ఎస్ ఎం ఫైజాన్, తిరువూరు జనసేన ఇన్‌చార్జి ఎం శ్రీనివాస్, పరిశపోగు రాజేష్ పాల్గొన్నారు.

పిన్నమనేనిలో నవజాత శిశువుకు

అరుదైన శస్త్రచికిత్స

గన్నవరం, జూలై 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన అవుటపల్లి డాక్టర్ పిన్నమనేని సిద్ధార్థ మెడికల్ కళాశాల బోధనాస్పత్రిలోని పీడీయాట్రిక్ విభాగం ఆధ్వర్యంలో నవజాత శిశువుకు అరుదైన శస్త్ర చికిత్సను విజయవంతంగా చేశారు. ఆ వివరాలను పీడీయాట్రిక్ హెచ్‌వోడీ డాక్టర్ జీవీఎస్ఎన్ ప్రసాద్ వైద్య బృందంతో కలిసి బుధవారం మీడియాకు వివరించారు. గుంటూరు జిల్లా తెనాలి మండలం శుద్ధపల్లి గ్రామానికి చెందిన మానుకొండ అశోక్, చిన్నారి దంపతులకు గత నెల 19న ఆడశిశువు జన్మించింది. డెలివరికి ముందు స్కానింగ్‌లో శిశువు కడుపులో పెద్ద కణితి ఉన్నట్టు రేడియాలజీ వైద్యులు గుర్తించారు. ఈ కణితి సుమారు 9 ఇంటూ 8 మిల్లీమీటర్ సైజులో ఉన్నట్టు చెప్పారు. ప్రసూతి విభాగం వైద్య బృందం చిన్నారికి డెలివరీ చేశారు. పాప పుట్టినప్పుడు సుమారు 2.7 కేజీలుంది. పుట్టిన వెంటనే పాపను పీడీయాట్రిక్ విభాగం ఎన్ఐసీయూలో ఉంచి రక్త, సిటీస్కాన్ పరీక్షలు నిర్వహించారు. పాప కడుపులో పెద్ద కణితి ఉందని నిర్ధారించుకుని గత నెల 20న శస్త్రచికిత్స చేశారు. ఆ సమయంలో పాప చిన్నప్రేగు మడతపడి పగిలిపోవటంతో మలం పొట్టలోకి చేరి మరో కణితిలా ఉంది. దాన్ని గుర్తించి ఆ కణితిని కూడా తొలగించి ప్రేగును యథాతథంగా అతికించారు. ప్రస్తుతం తల్లిబిడ్డ క్షేమంగా ఉన్నట్లు డాక్టర్ ప్రసాద్ తెలిపారు. సూపరింటెండెంట్ డాక్టర్ బీ అనిల్‌కుమార్, డిప్యూటీ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ కే కల్యాణి, పీడీయాట్రిక్ వైద్యులు నిషాంత్, శ్రీహర్ష, రత్న పాల్గొన్నారు. ఈ అరుదైన శస్త్ర చికిత్సను విజయవంతంగా చేయటంపై వైద్య బృందాన్ని డైరెక్టర్ జనరల్ డాక్టర్ చదలవాడ నాగేశ్వరరావు అభినందించారు.



ట్రాఫిక్ పద్మవ్యూహంలో బెజవాడ

విజయవాడ సిటీ, జూలై 16 (ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్ పోలీసుల ముందస్తు ప్రణాళిక, సమన్వయ లోపం నగరాన్ని బుధవారం రాత్రి ట్రాఫిక్ పద్మవ్యూహంలో పడేసింది. జాతీయ రహదారులపై వస్తున్న వాహనాల రాకపోకలను పసిగట్టడంలో విఫలం, పోలీసుల్లో సమన్వయం లేకపోవడంతో బెంజిసర్కిల్, రమేష్ ఆసుపత్రి, మహానాడు జంక్షన్, రామవరప్పాడు రింగ్, కృష్ణలంక ప్రాంతాల్లో ట్రాఫిక్ ఒక్కసారిగా స్తంభించింది. రాత్రి 7 గంటల నుంచి 8.15 వరకు వాహనాలు ఎక్కడికక్కడే నిలిచిపోవడంతో ప్రయాణికులు ప్రజలు తీవ్ర అసహనానికి గురయ్యారు.



అధికారుల అనుమతి లేకుండా వెంచర్‌లో జరుగుతున్న పనులు

అక్రమ వెంచర్లపై అధికారులు కన్నెర్ర

● నిర్మాణ పనులకు అడ్డుకట్ట

మైలవరం రూరల్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): కొన్నిరోజులుగా స్థానిక అధికారులకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా ఇష్టానుసారంగా జరుపుతున్న అక్రమ వెంచర్ నిర్మాణ పనులను అధికారులు అడ్డుకున్నారు. మండలంలోని చంద్రగూడెం గ్రామంలో ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమార్కులు వెంచర్ నిర్మాణం చేపడుతుండగా బుధవారం సాయంత్రం పంచాయతీ, రెవెన్యూ అధికారులు నిలిపివేయించారు. వివరాల్లోకి వెళితే చంద్రగూడెం గ్రామంలోని ఆర్ఎస్‌నెం.386-1ఏ, 389-2ఏ,97-1ఏ సర్వే నెంబర్లలో 16 ఎకరాల భూమి ఉంది. ఈ భూమిలో సీఆర్‌డీఏ పర్మిషన్ లేకుండా కొంతమంది ప్లాట్లుగా విభజించి గ్రావెల్‌తో రహదారులు, డ్రెయినేజీలను ఏర్పాటు చేస్తుండగా గ్రామ కార్యదర్శి మీరా సాహెబ్, వీఆర్వో రవి, సిబ్బంది అక్రమ లే అవుట్ వద్దకు చేరుకుని పర్మిషన్‌కు సంబంధించిన పత్రాలను అడగడంతో అక్రమార్కులు తెల్లబోయారు. ఒకవేళ సీఆర్‌డీఏ పర్మిషన్ ఉన్నా స్థానిక పంచాయతీకి సమాచారం ఇవ్వకపోవడంపై ఆశ్చర్యంగా ఉందని ఆగ్రహం వ్యక్తం చేశారు. మీ దగ్గరున్న వెంచర్‌కు సంబంధించిన పర్మిషన్లు, పొలం డ్యాక్యుమెంట్లు అన్ని వివరాలను పంచాయతీకి తెలపాలని సూచించారు. తమ అనుమతి లేకుండా నిర్మాణాలు చేపట్టవద్దని హెచ్చరించారు. ఈ విషయం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళతామని కార్యదర్శి మీరాసాహెబ్ తెలిపారు. ట్రాక్టర్లు, డోజర్లు, టిప్పర్లతో చేస్తున్న పనులను ఆపేశారు.

మద్యం మత్తులో హోంగార్డుపై దాడి

● తలపై తీవ్ర గాయంతో అపస్మారక స్థితిలోకి

● పోలీసుల అదుపులో నిందితుడు

పెనమలూరు, జూలై 16 (ఆంధ్రజ్యోతి): రోడ్డుపై మోటారుసైకిల్ అడ్డంగా ఉంది. తీయమన్నందుకు మద్యం మత్తులో ఉన్న మచిలీపట్నానికి చెందిన వెల్డర్ ఆలూరి వెంకన్న పెనమలూరు హోంగార్డు అశోక్‌పై ఐరన్ పైపుతో దాడి చేశాడు. దీంతో అశోక్ తలకు తీవ్ర గాయాలపాలై ఆసుపత్రిలో చేరగా అపస్మారక స్థితిలో ఉన్నట్టు పోలీసులు తెలిపారు. వివరాల్లోకి వెళితే కానూరు టైం ఆసుపత్రి సెంటర్‌లో సాయంత్రం 5 గంటల సమయంలో వెల్డర్ వెంకన్న మచిలీపట్నం వెళుతూ మార్గమధ్యంలో టైం ఆసుపత్రి జంక్షన్‌లో ఓ కారుకు అతడి కారును అడ్డంపెట్టాడు. దీంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. అక్కడే ట్రాఫిక్ విధులు నిర్వర్తిస్తున్న హోంగార్డు గమనించి అప్రమత్తమై వెంకన్నను అడ్డంగా ఉన్న బండిని తొలగించమని చెప్పగా మద్యం మత్తులో ఉన్న వెంకన్న పక్కనే ఉన్న ఐరన్ పైపుతో అశోక్ తలపై బలంగా మోదాడు. దీంతో తలపై చీలి రక్త స్రావం అయింది. దగ్గర్లోని ఆసుపత్రికి తరలించగా అశోక్ తలపై 8 కుట్లు వేశారు. మెరుగైన చికిత్సకు తాడిగడప వందడుగుల రోడ్డులోని కార్పొరేట్ ఆసుపత్రికి తరలించారు. అశోక్ ప్రస్తుతం అపస్మారక స్థితిలోకి వెళ్లినట్టు పోలీసులు తెలిపారు. దాడికి పాల్పడ్డ వెంకన్నను పోలీసులు అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశారు.





తీవ్రంగా గాయపడ్డ హోంగార్డు అశోక్, దాడికి పాల్పడ్డ వెంకన్న





మృతి చెందిన చల్లాశ్యామ్ శేఖర్, పార్వతి

మనవడి అంత్యక్రియలకు వచ్చి అనంతలోకాలకు..!

● అనారోగ్యంతో మనవడు.. కడుపునొప్పితో బామ్మ మృతి

గుణదల, జూలై 16 (ఆంధ్రజ్యోతి): రామవరప్పాడులో విషాద ఘటనలు చోటుచేసుకున్నాయి. శ్రీకాకుళం జిల్లా లావేరు మండలం తాళవంస గ్రామం నుంచి మనవడు చల్లా శ్యామ్‌శేఖర్ (27) మరణ వార్త విని అంత్యక్రియలకు హాజరయ్యేందుకు వచ్చిన నానమ్మ తాటిశెట్టి పార్వతి (54), మూడో రోజు కడుపు నొప్పితో ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో చనిపోయింది. శ్యామ్‌శేఖర్‌కు ఏడాది క్రితం వివాహం జరిగింది, కానీ ఈ నెల 11న అనారోగ్యంతో మరణించాడు. దీంతో 24న నగరానికి చేరుకున్న పార్వతి, మనవరాలిని ఓదార్చే ప్రయత్నంలో ఉంది. అయితే, బుధవారం మధ్యాహ్నం భోజనం తర్వాత కడుపు నొప్పి రావడంతో ఈనో ఇచ్చినా ఫలితం లేకపోవడంతో ఆటోలో ఆసుపత్రికి తీసుకెళ్తుండగా మరణించింది. మనవడి అంత్యక్రియలు పూర్తి కాకముందే నానమ్మ మరణంతో బంధువులు, స్థానికులు శోకసంద్రంలో మునిగిపోయారు.

క్షయరహిత జిల్లాకు కృషి

● ప్రజల్లో సరైన అవగాహనతోనే క్షయవ్యాధికి కట్టడి

● అధికారులను అభినందించిన కేంద్ర టీబీ బృందం

● విజయవాడలో కేంద్ర టీబీ డివిజన్ బృందం పర్యటన

విజయవాడ, జూలై 16 (ఆంధ్రజ్యోతి): క్షయవ్యాధి నివారణ, నియంత్రణపై ప్రజల్లో సరైన అవగాహన కల్పించడంతో పాటు జిల్లా వైద్యాధికారులు, సిబ్బంది తీసుకుంటున్న చర్యలు అభినందనీయమని కేంద్ర టీబీ డివిజన్ బృంద సభ్యులు పేర్కొన్నారు. టీబీ ముక్తాభారత్ అభియాన్‌లో భాగంగా జిల్లాలో క్షేత్రస్థాయిలో తీసుకుంటున్న చర్యలను పరిశీలించడానికి బృంద సభ్యులు బుధవారం విజయవాడలో పర్యటించారు. ఏపీఐఐసీ కాలనీ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి టీబీముక్తా భారత్ అభియాన్ అమలు తీరును పరిశీలించారు. క్షయవ్యాధిపై ప్రజల్లో అవగాహన కల్పించడం, వ్యాధి నిర్ధారణ, ఉచిత మందుల పంపిణీ, వ్యాధి బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికారులు చేపడుతున్న కార్యక్రమాల తెలుసుకున్నారు. అనంతరం సిద్ధార్థ మెడికల్ కాలేజీలోని సీడీఎస్‌టీ-టీబీ ల్యాబ్‌ను సందర్శించి రోగులకు అందుతున్న సేవలపై సంతృప్తి వ్యక్తం చేశారు. వైద్యపరీక్షల నిర్వహణ, చికిత్స విధానం, నిక్షయ్ పోషన్ యోజన పథకం ద్వారా రోగులకు అందిస్తున్న పౌష్టికాహారం వివరాలను జిల్లా వైద్యాధికారులు కేంద్ర బృందానికి వివరించారు. నిక్షయ్ మిత్రుల కిట్లు పంపిణీ చేసే వివరాలను వైద్యాధికారులు తెలిపారు. ప్రతి గ్రామంలో పర్యటించి క్షయరోగులను గుర్తించి మెరుగైన చికిత్స అందేలా చర్యలు తీసుకుంటున్నామని బృందానికి వివరించారు. ఈ పర్యటనలో భాగంగా కేంద్ర బృంద సభ్యులు నిక్షయ్ మిత్రాలతో మాట్లాడారు. వాసవ్య మహిళా మండలి, అపోలో టైర్స్ హెల్త్‌కేర్ సెంటర్ మద్దతుతో చికిత్స పొందుతున్న రోగులకు పోషకాహార కిట్లను పంపిణీ చేశారు. కేంద్ర బృంద సభ్యులు డాక్టర్ భావనీసింగ్ కుశ్వహ, డీ ధర్మారావు, గంగాధర్ దాస్, రాష్ట్ర టీబీ అధికారి డాక్టర్ టీ రమేష్, జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ ఎం సుహాసిని పాల్గొన్నారు.



వైద్యాధికారులతో మాట్లాడుతున్న కేంద్ర టీబీ డివిజన్ బృంద సభ్యులు

దళితులపై దాడులు పెరుగుతున్నాయి

ఆర్పీఐ రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పులేటి దేవీప్రసాద్

భారతీనగర్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో దళితులపై దాడులు పెరుగుతున్నాయని, వాటిని అరికట్టి రక్షణ కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషిచేయట్లేదని రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పులేటి దేవీప్రసాద్ అన్నారు. విజయవాడలోని ఆర్పీఐ రాష్ట్ర కార్యాలయంలో బుధవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం దళితుల మధ్య అంతరాలు పెంచి దాడులకు ఉసిగొల్పుతోందన్నారు. కూటమి ప్రభుత్వం దళితుల్లోని ఒక ఉపకులానికి మద్దతు ఇస్తోందని, మరో ఉపకులం వారిపై దాడులు చేయిస్తోందన్నారు. పశ్చిమగోదావరి జిల్లా అత్తిలి మండలం ఆరవల్లి గ్రామంలో ప్రభుత్వ పెద్దల అండతో మాదిగ యువకులు.. ఐదుగురు మాల యువకులను హింసించారని ఆయన ఆరోపించారు. పోలీసులు నామమాత్రపు కేసుపెట్టి దాటవేసే ప్రయత్నం చేస్తున్నారన్నారు. కృష్ణాజిల్లాలోని గన్నవరం మండలం జక్కులనెక్కలం గ్రామంలోనూ మాలలపై మాదిగలను రెచ్చగొట్టి ఘర్షణకు పాల్పడ్డారని ఆరోపించారు. ఈ దాడులన్నీ ప్రభుత్వమే చేయిస్తోందన్నారు. అనంతరం ఆర్పీఐలోని వివిధ విభాగాల్లో వ్యక్తులను నియమిస్తూ ప్రకటన చేశారు.

వీఆర్వోపై ఎమ్మెల్యే మాధవీరెడ్డి వ్యాఖ్యలను

ఉపసంహరించుకోవాలి

● వీఆర్వోల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రవీంద్రరాజు

గాంధీనగర్, జూలై 16 ఆంధ్రజ్యోతి): వీఆర్వోను బ్రోకర్ అంటూ ఎమ్మెల్యే మాధవీరెడ్డి వ్యాఖ్యానించడాన్ని గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు భూపతిరాజు రవీంద్రరాజు బుధవారం ఒక ప్రకటనలో ఖండించారు. వీఆర్వోల మనోభావాలను కించపరిచేలా చేసిన వ్యాఖ్యలను తక్షణమే ఉపసంహరించుకుని క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఉద్యోగులను ప్రజల ముందు కించపరుస్తూ అసభ్యకరంగా మాట్లాడకుండా హుందాగా ఉండాలని ప్రజాప్రతినిధులకు ఆదేశాలివ్వాలని సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్‌ను ఆయన కోరారు. ఎమ్మెల్యే మాధవీలత వాస్తవాలు తెలుసుకోకుండా వీఆర్వోను మున్సిపల్ కౌన్సిలర్‌కు బ్రోకర్‌గా పని చేస్తున్నావని మాట్లాడటం సరైందికాదని, ప్రభుత్వ నిబంధనలను అనుగుణంగానే వీఆర్వోలు పనిచేస్తారని పేర్కొన్నారు. ప్రజలు పెట్టిన దరఖాస్తులు సరిగ్గా ఉంటే ఎవరి సిఫార్సు లేకుండానే రేషన్‌కార్డు, పెన్షన్ వంటివి మంజూరు చేయడం జరుగుతుందని ఆయన తెలిపారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	103, 111, 122
చికెన్ విత్ స్కిన్	196
చికెన్ స్కిన్‌లెస్	206

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 515

కొండాలమ్మను దర్శించుకున్న కొనకళ్ల

గుడ్లవల్లేరు, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : వేమవరం కొండాలమ్మ అమ్మవారిని బుధవారం ఏపీఎస్ ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు దర్శించుకున్నారు. కొనకళ్ల నారాయణరావుకు ఆలయ అర్చకులు స్వాగతం పలికారు. ప్రత్యేకపూజల అనంతరం ఆయన అమ్మవారిని దర్శించుకొని మెక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ సాంప్రదాయం ప్రకారం నారాయణరావును సత్కరించి అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలను ఆలయ కార్య నిర్వహణాధికారి ఆకుల కొండలరావు అందజేశారు.


కొనకళ్ల నారాయణను సత్కరిస్తున్న ఈవో కొండలరావు

ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందిస్తాం

● ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

గుడివాడ, జూలై 16(ఆంధ్రజ్యోతి) : అర్హులైన ప్రతి పేదవానికి సంక్షేమ ఫలాలను అందిస్తామని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. బుధవారం స్థానిక 6,7 వార్డుల్లో సుపరిపాలనకు తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రావి వెంకటేశ్వరరావుతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వెనిగండ్ల మాట్లాడుతూ పేదల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని, కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది కాలంలోనే అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారని, సంక్షేమ పథకాలను అందిస్తున్నారన్నారు. గుడివాడ పురపాలక సంఘ అభివృద్ధికి రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేకంగా రూ.10కోట్లు నిధులను అందించారన్నారు. త్వరలోనే పనులు ప్రారంభమై పట్టణంలో పలు సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్‌టిఆర్ స్టేడియం కమిటీ ఉపాధ్యక్షులు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కూచిపూడి: సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా నిడుమోలు వైసీపీ సర్పంచ్ కొమరగిరి అంజలి పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా సమక్షంలో బుధవారం టీడీపీలో చేరారు. పార్టీ కండువా కప్పి ఆమెను ఎమ్మెల్యే పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో భాగంగా మల్లేశ్వరం, వీరాయలంక, నిడుమోలు గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలు వారికి వివరించి ఏయే పథకాలు అందుతున్నాయన్న వివరాలు తెలుసుకున్నారు.ఈ కార్యక్రమంలో టీడీపీ మండల పార్టీ అధ్యక్షులు లింగమనేని రామలింగేశ్వరరావు, పార్టీ నేతలు వీరంకి తులసీదాస్, యార్లగడ్డ శ్రీనివాసరావు, జొన్నలగడ్డ సామ్రాజ్య లక్ష్మీ, గుత్తికొండ పద్మ, జొన్నలగడ్డ సత్యనారాయణ, కూటమి నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.


టీడీపీలో చేరిన వైసీపీ నిడుమోలు సర్పంచ్ అంజలి


స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెనిగండ్ల, రావిలు

నందివాడ: గ్రామాల అభివృద్దే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని గుడివాడ నియోజకవర్గ శాసనసభ్యులు వెనిగండ్ల రాము అన్నారు. బుధవారం మండలంలోని నందివాడ, అరిపిరాల, పోలాసివారిపాలెంలో సుపరిపాలనకు తొలి అడుగు కార్యక్రమం అరిపిరాల గ్రామ పార్టీ అధ్యక్షులు చింతా కమలయ్య సోల్మాన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పోలాసివారి పాలెంలో దాతల సహాయ సహకారాలతో ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహాన్ని వెనిగండ్ల రాము ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో గుడివాడ మార్కెట్ యార్డు చైర్మన్ చాట్రగడ్డ రవి, సన్యాసిరావు, రాజేష్, గుళ్లపల్లి నాగబాబు, బండి సుబ్రహ్మణ్యం, బొడ్డు ప్రకాష్, పాల్గొన్నారు

మాంసం వ్యర్థాలతో చేపలసాగు ..!

● చేపల మేతగా మాంసం వ్యర్థాలు
● ఆందోళన వ్యక్తం చేస్తున్న గ్రామస్థులు
● రోగాల బారిన పడుతున్న ప్రజలు

దోసపాడు పంచాయతీ ఊర చెరువులో మాంసం వ్యర్థాలను చేపలకు మేతగా వేస్తుండటంతో తీవ్ర దుర్గంధం వెదజల్లుతోంది. తీవ్రమైన దుర్వాసనతో ఉండలేకపోతున్నామని, అనారోగ్యం పాలవుతున్నామని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

(ఆంధ్రజ్యోతి - పెదపారుపూడి) : మండలంలోని దోసపాడులో 4ఎకరాల విస్తీర్ణంలో ఉన్న పంచాయతీ చెరువును గతంలో గ్రామస్థులు మంచినీటికోసం వినియోగించుకునేవారు. ఈ తర్వాత ఈ చెరువును ఊర చెరువుగా మార్చి, చేపల పెంపకాన్ని చేపట్టారు. ఈ చెరువును స్థానిక సర్పంచ్ భర్త ఎవరిని రానివ్వకుండా బినామీ పేరుతో ఆక్రమంగా రూ. 7లక్షలకే వేలంపాటలో దక్కించుకున్నారు. గతంలోను బినామీ పేరుతో ఇదే తరహాలో లీజుకు తీసుకుని సదరు మొత్తాన్ని పంచాయతీకి జమచేయలేదని గ్రామస్థులు బహిరంగంగానే ఆరోపిస్తున్నారు. లీజుకు తీసుకున్న సదరు ప్రజాప్రతినిధి భర్త ఇష్టానుసారంగా మేతతో పాటు మాంసం, చేపల వ్యర్థాలను తీసుకుని వచ్చి చెరువులో వేస్తున్నట్లు గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. గుడివాడలోని చికెన్, మాంసం దుకాణాల నుంచి ఆటోలో వాటి వ్యర్థాలను తీసుకువస్తున్నట్టు గ్రామస్థులు పేర్కొన్నారు. పంచాయతీరాజ్ అధికారులు స్పందించి చెరువులో మాంసం వ్యర్థాలు వేయకుండా నిరోధించాలని గ్రామస్థులు కోరుతున్నారు.


దోసపాడులోని చేపల చెరువు

మంచినీటి చెరువుకు నీళ్లు వదలడం లేదు



గ్రామంలోని రక్షిత మంచినీటి పథకం ద్వారా మంచినీటి చెరువుకు నీళ్లు ఎక్కించకుండా తాను పాడుకున్న చేపల చెరువుకు నీళ్లను విడుదల చేస్తున్నారు. లీజుకు తీసుకున్న చెరువుగట్టుపై అన్నం, మాంసం వ్యర్థాలను నిల్వ చేస్తున్నారు. దీంతో తీవ్ర దుర్వాసన వెదజల్లుతుంది.

బొడ్డపాటి హరిప్రసాద్, దోసపాడు

గుడివాడ నుంచి వ్యర్థాలను తీసుకొస్తున్నారు



దోసపాడు పంచాయతీకి చెందిన చెరువును లీజుకు తీసుకుని ఇష్టానుసారంగా మాంసం వ్యర్థాలను గుడివాడ నుంచి ఆటోలో తరలించి మేతగా చెరువులో వేస్తున్నారు. దీంతో దుర్గంధంతో రోగాలబారిన పడుతున్నాము.

కావూరి సురేష్‌కుమార్, దోసపాడు

చెరువుల్లో మాంసం వ్యర్థాలు వేయడం నేరం

పంచాయతీల చెరువులను లీజుకు తీసుకున్న వారు ఆయా చెరువుల్లో మాంసం, అన్నం వ్యర్థాలను వేయడం నేరం. గ్రామస్తుల ఫిర్యాదు మేరకు చర్యలు తీసుకుంటాం.

వంగా శ్రీనివాసరావు , డిప్యూటీ ఎంపీడీవో

అయ్యప్ప దేవాలయంలో ప్రత్యేక పూజలు

పామర్రు, జూలై16 (ఆంధ్రజ్యోతి): పామర్రులో వేంచేసి యున్న హరిహరపుత్రుడు అయప్ప దేవాలయంలో బుధవారం స్వామివార్లకు వేదాంతా చార్యులు మురళీ కృష్ణమాచార్యులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, పంచ హారతులు నిర్వహించారు.

సమస్యల పరిష్కారానికి సమన్వయ కృషి అవసరం

● ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

నందివాడ, జూలై 16 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారానికి అందరూ కలిసికట్టుగా పని చేసి, సంక్షేమ పథకాలను అందరికీ అందేలా చూడాలని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అధికారులకు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో ఎమ్మెల్యే మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వెనిగండ్ల మాట్లాడుతూ ప్రభుత్వ అధికారులు వైసీపీ మత్తు విడి ప్రజలకోసం పని చేయాలన్నారు. గ్రామాల్లో ప్రభుత్వ అధికారుల నిర్లక్ష్యం వల్ల కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా పనులు జరగటం లేదంటూ గ్రామస్థులు వాపోతున్నారన్నారు. దండిగానపూడి క్లస్టర్‌లోనే 45 మందికి అమ్మఒడి డబ్బులు పడలేదంటే అధికారులు ఎంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనేది అర్థమవుతుందని మండి పడ్డారు. గత ప్రభుత్వంలో అని ప్రభుత్వ శాఖలలో ఏదో ఒక తప్పు జరిగింది వాటిని సరి చేసే మార్గం మీ అధికారుల చేతుల్లోనే ఉన్నది అన్నారు. గ్రామాల వారీగా మీటింగ్‌లు పెట్టి ప్రజల సమస్యలు తీర్చే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. అదేవిధంగా గ్రామంలో ఏ మీటింగ్ పెట్టినా స్థానిక టీడీపీ నాయకుల సహాయ సహకారాలు ఉంటాయన్నారు. ఒక్క పోలుకొండ పంచాయతీలో గత ప్రభుత్వంలో కార్యదర్శి చేసిన తప్పులకు రూ.30 లక్షల వరకు బకాయిలు ఉన్నాయంటే ఇంకా మండలంలో ఎన్ని పంచాయతీలలో అవకతవకలు జరిగాయో ఆ భగవంతుడికే తెలియాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ గురుమూర్తి, ఎంపీడీవో మల్లేశ్వరి, డిప్యూటీ ఎంపీడీవో అమీర్ మీర్జా బాష, మార్కెట్ కమిటీ చైర్మన్ చాట్రగడ్డ రవి, టీడీపీ మండల అధ్యక్షులు దానేటి సన్యాసిరావు, వివిధ శాఖల అధికారులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెనిగండ్ల

పేదరికం లేని సమాజమే ధ్యేయం

గుడివాడ రూరల్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): పేదరికం లేని సమాజ స్థాపనే పీ4 సర్వే లక్ష్యమని, అధికారులు సమన్వయంతో పని చేయాలని గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. బుధవారం గుడివాడ మండల పరిషత్ కార్యాలయంలో ఎమ్మెల్యే అధ్యక్షతన అన్ని శాఖల ఆధ్వర్యంలో పీ4 కార్యక్రమంపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద కుటుంబాలను గుర్తించి దాతలను కనుగొని వారిని దత్తత తీసుకునే కార్యక్రమాన్ని అమలు చేయాలని తెలిపారు. బంగారు కుటుంబాలు తయారు చేయటానికి రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తుందని తెలిపారు. ఎంపీడీవో విష్ణుప్రసాద్, తహసీల్దార్ కిరణ్, టీడీపీ మండల అధ్యక్షుడు మురళీ పాల్గొన్నారు.

పెదపారుపూడి : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా రూపొందించిన పీ4 సర్వే విజయవంతం కావటానికి మండలంలోని ముఖ్య నాయకులు సహకరించాలని పెదపారుపూడి మండల ప్రత్యేకాధికారి సాయి ప్రసాద్ కోరారు. బుధవారం పెదపారుపూడి మండల పరిషత్ కార్యాలయంలో టీడీపీ మండల అధ్యక్షుడు చలసాని రమేష్ చౌదరి ఆధ్వర్యంలో మండలంలోని ఎస్సీ సామాజిక వర్గ నాయకులతో సమావేశం నిర్వహించారు. పీ4 క్రింద మండలంలో బంగారు కుటుంబాలతో మ్యాప్ చేయబడిన మార్గదర్శకుల జాబితాను ఈ నెల 25వ తేదీలోపు అన్ని గ్రామాల్లో గ్రామసభలు జరిపి సోషల్ ఆడిట్ నిర్వహించనున్నామన్నారు. మండలంలోని మార్గదర్శకులు ముందుకు వచ్చి బంగారు కుటుంబాలకు దత్తత తీసుకునే విధంగా నాయకులు గ్రామాల్లో సహకరించాలని కోరారు. డిప్యూటీ ఎంపీడీవో వంగా శ్రీనివాస్, మాజీ జడ్పీటీసీ సభ్యులు చిలకా ఆంజనేయులు, మండల ముఖ్య నాయకులు మసిముక్కు రాంబాబు, దగాని లెనిన్, జుజ్జువరపు బాను ప్రసాద్, పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న సాయి ప్రసాద్

చెత్త సంపద తయారీ కేంద్రంలో చెత్త దహనం

పమిడిముక్కల, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : గ్రామాలలో ప్రతి ఇంటి నుంచి తడి, పొడి చెత్త వేర్వేరుగా సేకరించి దానిని చెత్తనుంచి సంపద తయారీకేంద్రానికి తరలించి ఎరువు తయారుచేయాల్సి ఉండగా అందుకు విరుద్ధంగా పలుగ్రామ పంచాయతీలు చెత్తను రోడ్లపక్కను వేసి తగులబెడుతూ కాలుష్యానికి కారకులవుతున్నారు. మండ ల పరిధిలో ఉన్న చెత్తనుంచి సంపద తయారీ కేంద్రం వద్ద అధికారులు వచ్చినప్పుడు హడావిడి చేసి తరువాత పట్టించుకునే వారు ఉండటం లేదు. మంటాడతో పాటు మరికొన్ని గ్రామాలలో సంపద కేంద్రాలు లేకపోవడం విశేషం. ఇదిలా ఉండగా ఆదాయం అంతమాత్రంగా ఉన్న పంచాయతీలకు చెత్తసంపద తయారీ కేంద్రాల నిర్వహణ భారంగా తయారవడంతో చాల చోట్ల చెత్తను తగుల బెడుతున్నారు. చెత్త తగులబడుతున్నప్పుడు వస్తున్న పొగ ఆ ప్రాంతమంతా కమ్ముకుని కాలుష్య భరితంగా తయారవుతుంది. దీంతో రోడ్డు పైన పొగ కమ్ముకుని కన్పించక ప్రమాదాలు జరుగుతున్నాయని వాహనాలు నడిపేవారు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.


సంపద తయారీ కేంద్రం వద్ద తగల బెడుతున్న చెత్త

గ్రామాల అభివృద్ధికి దాతల సహకారం అవసరం


విద్యార్థులకు నోట్ పుస్తకాలు అందిస్తున్న గురుమూర్తి

తోట్లవల్లూరు, జూలై 16(ఆంధ్రజ్యోతి) : స్వచ్ఛ వల్లూరుపాలెం కార్యక్రమానికి శ్రీకారం చుట్టటం అభినందనీయమని, అభివృద్ధిలో స్వచ్ఛంద సంస్థలు భాగస్వాములు కావటం శుభపరిణామమని రాష్ట్ర గౌడ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి వెంకట గురుమూర్తి అన్నారు. స్వర్ణాంధ్ర-స్వచ్ఛ ఆంధ్రలో భాగంగా వల్లూరుపాలేనికి చెందిన హెల్పింగ్ హ్యాండ్స్ స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపకుడు చింతపల్లి వెంకటేశ్వరరావు బుధవారం స్వచ్ఛ వల్లూరుపాలెం కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా రాష్ట్ర గౌడ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి వెంకట గురుమూర్తి, మండల టీడీపీ అధ్యక్షుడు వీరపనేని శివరామ్‌ప్రసాద్, జిల్లా తెలుగు యువత మాజీ అధ్యక్షుడు రామినేని కుటుంబయ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా స్థానిక జడ్పీ హైస్కూల్లో విద్యార్థులకు నోటు పుస్తకాలను పంపిణీ చేశారు. హైస్కూల్ ఆవరణలో జంగిల్ క్లియరెన్స్ నిర్వహించి మొక్కలు నాటారు. హైస్కూల్ ప్రధానోపాధ్యాయిని జి.స్వరాజ్యలక్ష్మీ, శ్రీకాంత్ పాల్గొన్నారు.

ముగిసిన నేత్ర వైద్య శిబిరం

గుడ్లవల్లేరు, జూలై 16 (ఆంధ్రజ్యోతి) : శేషాద్రిరావు గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కళాశాలలో గత మూడురోజులుగా బొప్పన శరత్‌గోపాల్ ఫౌండేషన్ వారిచే నిర్వహిస్తున్న ఉచిత నేత్ర వైద్యపరీక్షలు బుధవారంతో ముగిశాయి. ఇంజనీరింగ్, పాలిటెక్నిక్, ఫార్మసీ, హైస్కూల్ విద్యార్థులు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది 4200 మందికి దృష్టిలోప, సంబంధిత రుగ్మతలను స్క్రీనింగ్ నిర్వహించి అవసరమైన వారికి కళ్ళజోళ్లు సిఫార్సు చేశారు. ముగింపు కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు బొప్పన కిషోర్, వి.సీతారామ్, కళాశాల ప్రిన్సిపల్ ఇన్‌చార్జ్ పి.కోదండరామారావు తదితరులు పాల్గొన్నారు.

సేంద్రియ వ్యవసాయంతో అధిక దిగుబడులు

గుడివాడ రూరల్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): వరి నాట్లు వేసేటప్పుడు రైతులు జాగ్రత్తలు పాటించాలని ఘంటసాల వ్యవసాయ శాస్త్రవేత్త పద్మావతి అన్నారు. బుధవారం రామన్నపూడిలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. వరినాట్లు వేసే ముందు పొటాష్ తదితరాలు వేసుకోవాలని సూచించారు. సేంద్రియ వ్యవసాయం వల్ల పొలం సారవంతం కావటమే కాక ధాన్యం తినే మనుషులు ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. మండల వ్యవసాయాధికారి అనంతలక్ష్మి పాల్గొన్నారు.

పమిడిముక్కల : వరినారుమడులలో యాజమాన్య పద్ధతులు పాటించి జింకు, ఇనుము, ధాతులోప నివారణకు రైతులు చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయ అధికారి జి.గణేశ్‌రెడ్డి అన్నారు. తాడంకిలో బుధవారం పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించి రైతులకు పలు సూచనలు చేశారు. వరినాట్లు వేసేప్పుడు నారు కొసలు తుంచి నాటడం వల్ల కాండం తొలిచేపురుగు గుడ్ల సముదాయాలు నిర్మూలించ బడతాయన్నారు.

గుడ్లవల్లేరు : ప్రతి రైతు పంటబీమా తప్పనిసరిగా చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి సునీల్ అన్నారు. బుధవారం మెణుతురుమిల్లిలో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. మాజీ ఎంపీటీసీ పిచ్చేశ్వరరావు, యశ్వంత్‌రాజా పాల్గొన్నారు.


రామన్నపూడిలో పొలం పిలుస్తోంది కార్యక్రమం

దేవాలయాల హుండీల లెక్కింపు

గుడివాడ, జూలై 16(ఆంధ్రజ్యోతి) : స్థానిక గౌరీశంకరస్వామి దేవస్థానం, వేణుగోపాలస్వామి దేవస్థానాల హుండీ ఆదాయ లెక్కింపు కార్యక్రమాన్ని బుధవారం దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ ఉయ్యూరు సుధాకర్ పర్యవేక్షణలో నిర్వహిస్తున్నట్టు దేవస్థానాల కార్యనిర్వహణాధికారి కందుల వేణుగోపాలరావు తెలిపారు. గౌరీశంకరస్వామి దేవస్థాన హుండీ ఆదాయం రూ.3,39,728లు, శ్రీవేణుగోపాలస్వామి దేవస్థాన హుండీ ఆదాయం రూ.25,889లు సమకూరినట్టు ఆయన పేర్కొన్నారు. భక్తులు, సిబ్బంది పాల్గొన్నారు.

మధ్యవర్తిత్వంతో కేసుల పరిష్కారం

కూచిపూడి: మధ్యవర్తిత్వంతో కేసుల పరిష్కారానికి జాతీయ, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థల ఆదేశాల ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నట్టు మొవ్వ కోర్టు న్యాయమూర్తి స్వర్ణలత వోల్గా మార్క్ బుధవారం పేర్కొన్నారు. దీనిలో భాగంగానే మొవ్వలో బైక్ ర్యాలీ నిర్వహించారు. న్యాయస్థానంలో నిరంతరం జరిగే మధ్యవర్తిత్వ కార్యక్రమంలో వివాహ సంబంధమైన వివాదాలు, ప్రమాద, చెక్ బౌన్స్, భూముల పంపకాలు తదితర కేసులు పరిష్కరించుకోవచ్చునని ఆమె సూచించారు. ఎంఎల్ఎస్‌సీ స్టాఫ్ ఎం.రాణి తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటా చెత్త సేకరించాలి

గుడివాడ : పురపాలక సంఘం పరిధిలో కొనసాగుతున్న ఇంటింటి చెత్త సేకరణ నూరుశాతం ఉండేలా చర్యలు తీసుకోవాలని, డ్రెయిన్ల శుభ్రత, సిల్ట్ తొలగింపును ప్రణాళిక ప్రకారం పూర్తిస్థాయిలో జరిగేటట్లు శానిటరీ ఇన్‌స్పెక్టర్లు పర్యవేక్షించాలని మున్సిపల్ కమిషనర్ సింహాద్రి మనోహర్ ఆదేశించారు. బుధవారం స్థానిక మున్సిపల్ సమావేశ మందిరంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, వార్డు శానిటేషన్ అండ్ ఎన్విరాన్‌మెంట్ కార్యదర్శులు, శానిటరీమేస్త్రీలు, సమీక్షా సమావేశం నిర్వహించారు. అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

డొంకరోడ్లకు మరమ్మతులు

గుడ్లవల్లేరు : గుడ్లవల్లేరు మార్కెట్ కమిటీ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్ల సమావేశం బుధవారం యార్డ్ కార్యాలయంలో నిర్వహించారు. గుడ్లవల్లేరు మార్కెట్ యార్డ్ పరిధిలోని పలు నాన్ నోటిఫైడ్ డొంక రోడ్ల నిర్మాణం పనులు, యార్డ్ ఆవరణ, గోదాముల మరమ్మతు పనులకై ప్రతిపాదనలు చేస్తూ తీర్మానించారు. కమిటీ చైర్మన్ పొట్లూరి రవి కుమార్, వైస్‌చైర్మన్ కల్యాణకృష్ణయ్య, పాల్గొన్నారు.

స్టేడియం అభివృద్ధికి భాస్కరరావు విశేష కృషి

గుడివాడ : ఎన్టీఆర్ స్టేడియం వ్యవస్థాపకుడిగా స్టేడియం అభివృద్ధికి పొట్లూరి భాస్కరరావు ఎంతో తోడ్పాటునందించారని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. బుధవారం స్థానిక స్టేడియం ఆవరణలో ఏర్పాటు చేసిన భాస్కరరావు చిత్రపటానికి నివాళులర్పించారు. కమిటీ ఉపాధ్యక్షుడు శ్రీనివాసరావు, రంగప్రసాద్, సభ్యులు వీరభద్రరావు, ఆంజనేయులు, సాంబశివరావు పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	103, 111, 122
చికెన్ విత్ స్కిన్	196
చికెన్ స్కిన్‌లెస్	206

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 515

రోడ్డు ప్రమాదంలో ఐదుగురికి గాయాలు


గాయపడిన బాధితులు

అవనిగడ్డ రూరల్, జూలై 16(ఆంధ్రజ్యోతి): పులిగడ్డ వద్ద ప్రయాణికులతో వస్తున్న ఆటోను ట్రక్ ఆటో ఢీకొట్టింది. బుధవారం జరిగిన ఈ ఘటనలో ఐదుగురికి గాయాలయ్యాయి. గాయపడిన వారిని అవనిగడ్డ ప్రభుత్వాస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. వారిలో ఇద్దరిని మెరుగైన చికిత్స కోసం మచిలీపట్నం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మోపిదేవి వైపు నుంచి రేపల్లె వెళ్తున్న ప్యాసింజర్ ఆటోను రేపల్లె వైపు నుంచి వస్తున్న కోడిగుడ్ల ట్రక్ ఆటో ఢీకొనటంతో ఈ ఘటన జరిగింది. అవనిగడ్డ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రాష్ట్రంలో ప్రజారంజక పాలన

• ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్


పెడన 17వ వార్డులో..

పెడన/గూడూరు, జూలై 16(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ప్రజారంజక పాలన సాగిస్తోందని ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ తెలిపారు. పట్టణంలోని 17వ వార్డులో బుధవారం నిర్వహించిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వంలో సంక్షేమ, అభివృద్ధి పథకాలు పరుగులు పెడుతున్నాయన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన ఏ ఒక్క హామీని విస్మరించే ప్రసక్తే లేదని, అన్ని హామీలను నెరవేర్చి ప్రజల ఆదరాభిమానాలను చూరగొంటామని ఆయన స్పష్టం చేశారు. దుష్ప్రచారాన్ని నమ్ముకున్న వైసీపీకి 2029 ఎన్నికల్లో కూడా భంగపాటు తప్పదని ఆయన హెచ్చరించారు. నాయకులు యక్కల శ్యామలయ్య, వహబ్‌ఖాన్, అబ్దుల్ ఖయూం(హన్ను), ఖలీలుల్లాబాషా, ఉమ్మిటి పుష్పదంత్, కర్నా మోహనరావు, పులి రవీంద్రనాథ్, సేనాపతి అజయ్, గుల్లంకి మాధవ, ఎలిగట్ల ప్రసాద్, పరసా సూర్యనారాయణ, జితేంద్ర పాల్గొన్నారు.

పోలవరంలో..

గూడూరు మండలం పోలవరంలో నిర్వహించిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలో అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరించారు. కూటమి నాయకులు పాల్గొన్నారు.

కోడూరు 11వ వార్డులో..

కోడూరు: సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా కోడూరు 11వ వార్డులో టీడీపీ మండల అధ్యక్షుడు బండే శ్రీనివాసరావు పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను పంపిణీ చేసి ప్రభుత్వ పథకాలను వివరించారు. క్లస్టర్ ఇన్‌చార్జ్ కొక్కిలిగడ్డ జాన్ విల్సన్, అప్పికట్ల రవీంద్రబాబు, పూతబోయిన శ్రీనివాసరావు, కాగిత శివప్రసాద్, పిల్లి మల్లికార్జునరావు,


కోడూరు 11వ వార్డులో ..

వీరంకి వెంకటేశ్వరరావు, మోర్ల మాణిక్యాలరావు, బొలిశెట్టి విటల్ రావు, రాసంశెట్టి నాగరాజు, మహమ్మద్ ఇమ్రాన్, కోట రత్నరావు పాల్గొన్నారు.


పులిగడ్డలో ..

పులిగడ్డలో..

అవనిగడ్డ రూరల్: పులిగడ్డలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని టీడీపీ మండల అధ్యక్షుడు యాసం చిట్టిబాబు నిర్వహించారు. ఏడాది కాలంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను చిట్టిబాబు, టీడీపీ నాయకులు ప్రజలకు వివరించి కరపత్రాలను పంపిణీ చేశారు. పార్టీ గ్రామ అధ్యక్షుడు చెన్ను రాంబాబు, గుంటూరు వెంకటేశ్వరరావు, చెన్ను నాగేంద్రం, నాగిడి వెంకటేశ్వరరావు, మండలి శేషు, మండలి వెంకటేశ్వరరావు, పులిగోరు రాజేంద్ర, డీసీ వైస్ చైర్మన్ బచ్చు రఘునాథ్ ప్రసాద్, గుడివాక శివరావు, విశ్వనాథుని మురళీ, చందన రంగారావు, అడపా వెంకటేశ్వరరావు, అన్నపరెడ్డి లక్ష్మీనారాయణ, లింగం బాబూరావు, డేగల రాఘవ పాల్గొన్నారు.

సుందరంగా శ్మశానవాటికలు

• కోడూరులో దాతల సాయంతో అభివృద్ధి

(ఆంధ్రజ్యోతి-కోడూరు): నరసింహాపురం రహదారిలోని శ్మశాన వాటికను దాతల సాయంతో అభివృద్ధి చేస్తున్నారు. మండలంలోని పలువురు ప్రముఖులు అభివృద్ధి కమిటీగా ఏర్పడి ఈ పనులను చేయిస్తున్నారు. రూ.8 లక్షలతో పనులు చేసేందుకు ప్రణాళికలు రూపొందించారు. జంగిల్ క్లియరెన్స్ పనులు చేసి, హిందువుల శ్మశాన వాటికతోపాటు క్రైస్తవుల శ్మశాన వాటికలో కూడా అభివృద్ధి పనులు చేపట్టి రహదారిని ఏర్పాటు చేశారు. రూ.1,80,000తో మెరకపనులు చేయించారు. అద్దె ఇళ్లలో ఉండే వారు మృతదేహాలను పెట్టుకునేందుకు వీలుగా ప్రత్యేక గదిని ఏర్పాటు చేస్తున్నారు. అంత్యక్రియల అనంతరం స్నానాలు చేసేందుకు ప్రత్యేక వసతి ఏర్పాటు చేస్తున్నారు. లోపలికి వెళ్లే ప్రధాన ద్వారంపై రూ.2 లక్షలతో 8 అడుగుల శివుడు విగ్రహం ఏర్పాటు చేస్తున్నారు.


కోడూరులో మెరక పనులు చేసి అభివృద్ధిపరిచిన శ్మశానవాటిక

సకల సదుపాయాలతో..

(ఆంధ్రజ్యోతి-పెడన): పట్టణంలోని ఆర్యవైశ్య సామాజిక వర్గానికి చెందిన శ్మశానవాటిక అన్ని సదుపాయాలతో అందంగా రూపుదిద్దుకుంటుంది. 71 ఏళ్ల క్రితం ఏర్పడిన ఈ శ్మశానవాటిక అభివృద్ధికి పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కొల్లూరి చిన్నా నడుం బిగించారు. ఆయన పర్యవేక్షణలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. ఇప్పటి వరకు 80 శాతం పనులు పూర్తయ్యాయని, మిగిలిన పనులను త్వరలో పూర్తి చేస్తామని చిన్నా తెలిపారు. శ్మశాన వాటిక ఆవరణలో పచ్చనిచెట్లు పెంచి ఆహ్లాదకర వాతావరణం ఉండేలా చూస్తామన్నారు.


పెడనలో అందంగా రూపుదిద్దుకుంటున్న ఆర్యవైశ్య శ్మశానవాటిక

రైతుల అభ్యున్నతే ధ్యేయంగా పనిచేయండి

• మల్లేశ్వరం మార్కెట్ యార్డు కమిటీకి ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ సూచన

బంటుమిల్లి, జూలై 16(ఆంధ్రజ్యోతి): రైతుల అభ్యున్నతే ధ్యేయంగా పనిచేయాలని మల్లేశ్వరం మార్కెట్ యార్డు కమిటీకి ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ సూచించారు. బుధవారం మల్లేశ్వరం మార్కెట్ యార్డులో నిర్వహించిన నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. చైర్మన్‌గా ఒడుగు తులసీరావు, అర్తమూరుకు చెందిన భూపతి రమేష్ వైస్ చైర్మన్‌గా పాలకవర్గ సభ్యులుగా అమృతాల నాగమణి, బంద్రెడ్డి నాగరాంజనేయులు, పట్టపు లక్ష్మీపద్మావతి, చిలకాబత్తిన శ్రీదేవి, గంధం రామచంద్రరావు, జోగి నళిని, జొన్నలగడ్డ నాగేశ్వరమ్మ, మారుబోయిన సుబ్బారావు, నడకుదుటి వెంకటరెడ్డి, పర్ణం జయలక్ష్మీ, వక్కలగడ్డ కరుణకుమార్, ఎండీ అక్బర్ ప్రమాణస్వీకారం చేశారు. టీడీపీ మండల అధ్యక్షుడు కూనపరెడ్డి వీరబాబు, చలపాటి ప్రసాద్, లీలాకృష్ణ, సత్యనారాయణ, కేదార్ పాల్గొన్నారు.


మల్లేశ్వరం మార్కెట్ యార్డు కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్

సర్వసభ్య సమావేశం బహిష్కరణ

నాగాయలంక, రూరల్, జూలై 16(ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని టీడీపీ ఎంపీటీసీలు కొల్లాటి లక్ష్మీనాగేశ్వరమ్మ(సొర్లగొంది), నాగిడి ఆదిలక్ష్మి(నాగాయలంక-1), విశ్వనాథపల్లి లక్ష్మీ (గుల్లలమోద), లంకే శ్రీనివాసప్రసాద్(నాగాయలంక-2) బ బహిష్కరించారు. బుధవారం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో కొద్దిసేపు మాత్రమే వారు ఉండి అధికారుల పనితీరుకు నిరసిస్తూ సభ నుంచి వెళ్లిపోయారు. మండలంలోని ఎంపీటీసీ సభ్యులకు ప్రభుత్వం నెలలు తరబడి గౌరవ వేతనాలు ఇవ్వడం లేదని, గామాల్లో అభివృద్ధి కార్యక్రమాలకు ఎంపీటీసీలకు తగిన సమాచారం అధికారులు ఇవ్వడం లేదని టీడీపీ నాగాయలంక-2 ఎంపీటీసీ సభ్యుడు లంకే శ్రీనివాసప్రసాద్ మండల సర్వసభ్య సమావేశంలో నిరసన తెలిపారు. ఎంపీడీవో జి.సుధాప్రవీణ్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం వైసీపీ సభ్యులతో మొక్కుబడిగా సమావేశం జరిగింది. ఎంపీపీ భోగాది రాఘవారాణి అధ్యక్షత వహించారు.


ఎంపీడీవో సుధాప్రవీణ్‌కు వినతిపత్రం అందజేస్తున్న శ్రీనివాస ప్రసాద్

శతాధిక వృద్ధురాలి మృతి

అవనిగడ్డ రూరల్: పాత ఎడ్లంక గ్రామంలోని అరటిలంక ప్రాంతానికి చెందిన మైనేని సీతామహాలక్ష్మి(103) మృతి చెందారు. ఆమెకు ముగ్గురు కుమారులు ఉన్నారు.

వైస్ ఎంపీపీగా మోకా నాగప్రసాద్ ఏకగ్రీవ ఎన్నిక

నాగాయలంక, జూలై 16(ఆంధ్రజ్యోతి): వైస్ ఎంపీపీగా ఎదురుమొండి ఎంపీటీసీ సభ్యుడు మోకా నాగప్రసాద్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వైస్ ఎంపీపీ పరిశె అమ్మన్న కొద్దినెలల క్రితం మృతి చెందటంతో మండల పరిషత్ కార్యాలయంలో అధికారులు ఎన్నికను నిర్వహించారు. 14 మంది ఎంపీటీసీల్లో 10 మంది ఎంపీటీసీలు వైసీపీకి, నలుగురు టీడీపీకి ఉన్నారు. బుధవారం నిర్వహించిన ఎన్నికకు 9 మంది ఎంపీటీసీలు, ఒక కో-ఆప్షన్ సభ్యుడు హాజరయ్యారు. టీడీపీ ఎంపీటీసీలు నలుగురు హాజరు కాలేదు. దీంతో మత్స్యశాఖ జేడీ, ఎన్నికల అధికారి ఎ.నాగరాజు హాజరైన సభ్యులతో వైస్ ఎంపీపీ ఎన్నికను నిర్వహించారు. ఎదురుమొండి వైసీపీ ఎంపీటీసీ మోకా నాగప్రసాద్ పేరును వైస్ ఎంపీపీ అభ్యర్థిగా గణపేశ్వరం ఎంపీటీసీ బర్మా రాంబాబు ప్రతిపాదించగా, నంగేగడ్డ ఎంపీటీసీ చాట్రగడ్డ బాబూరావు, మిగతా వారు బలపర్చారు. దీంతో మోకా నాగ ప్రసాద్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు అధికారులు ప్రకటించి ధ్రువీకరణ పత్రాన్ని అందజేశారు. ఎన్నికల పరిశీలకులుగా డీఆర్వో కె.చంద్రశేఖర్‌రావు వ్యవహరించారు. ఎంపీడీవో జి.సుధాప్రవీణ్, తహసీల్దార్ సీహెచ్ వీరాంజనేయప్రసాద్ పాల్గొన్నారు.


వైస్ ఎంపీపీకి నియామక పత్రాన్ని అందజేస్తున్న అధికారులు

రైతు సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కృషి


• ఏఎంసీ చైర్మన్ కనకదుర్గ


కంది విత్తనాలు పంపిణీ చేస్తున్న తోట కనకదుర్గ

చల్లపల్లి, జూలై 16(ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని ఘంటసాల ఏఎంసీ చైర్మన్ తోట కనకదుర్గ అన్నారు. మంగళాపురంలో వ్యవసాయశాఖ ద్వారా పొలంగట్లపై చల్లుకునేందుకు నూరుశాతం రాయితీపై కంది విత్తనాల పంపిణీని ఏఎంసీ చైర్మన్ బుధవారం ప్రారంభించారు. మండలంలో రైతులు పొలం గట్లపై కంది విత్తనాలు చల్లుకునేందుకు నాలుగు క్వింటాళ్ల విత్తనాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. రైతులు ఆధార్‌కార్డు, పట్టాదారు పాసుపుస్తకం నకలుతో రైతుసేవాకేంద్రానికి వెళ్లి విత్తనాలు తెచ్చుకోవాలని సూచించారు. గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్ నాగేశ్వరరావు, ఏవో కె.మురళీకృష్ణ, రైతు ప్రముఖులు కమలాకరరావు, వీఏఏ జి.లక్ష్మి, రైతులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ చట్టం జిల్లా కమిటీ సభ్యుడిగా పరుచూరి

చల్లపల్లి, జూలై 16 (ఆంధ్రజ్యోతి): మంగళాపురం గ్రామానికి చెందిన ప్రగతి సేవా సంఘం అధ్యక్షుడు పరుచూరి వెంకటేశ్వరరావు ఎస్సీ, ఎస్టీ ప్రివెన్షన్ ఆఫ్ ఎట్రాసిటీ యాక్ట్ 1989 జిల్లా స్థాయి విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడిగా నియమితులయ్యారు. తనను ఈ పదవికి సిఫార్సు చేసిన ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్‌ను బుధవారం ఎమ్మెల్యే కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపి సత్కరించారు. గ్రామ పెద్దలు కొర్రపాటి కోటేశ్వరరావు, కిలారు పూర్ణచంద్రరావు, ముక్కు వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.


ఎమ్మెల్యే బుద్ధప్రసాద్‌ను సత్కరిస్తున్న వెంకటేశ్వరరావు

స్మార్ట్ మీటర్ల దోపిడీపై ప్రజా ఉద్యమం

మచిలీపట్నం టౌన్, జూలై 16(ఆంధ్రజ్యోతి): స్మార్ట్‌మీటర్లు బిగించి ప్రజలపై విద్యుత్ భారాలు మోపడాన్ని వ్యతిరేకిస్తున్నామని వాటిని రద్దు చేసేవరకు ప్రజా ఉద్యమాలు చేస్తామని సీపీఎం జిల్లా కార్యదర్శి వై.నరసింహారావు స్పష్టం చేశారు. విద్యుత్ చార్జీల పెంపుదల వ్యతిరేక ఐక్య ప్రజావేదిక ఆధ్వర్యంలో బుట్టాయిపేట జ్యోతీబాపూలే విజ్ఞాన కేంద్రంలో బుధవారం నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. తమిళనాడు, కేరళ, పశ్చిమబెంగాల్ రాష్ట్రాల్లో అక్కడి ప్రభుత్వాలు స్మార్ట్‌మీటర్లు బిగించేందుకు ఒప్పుకోకపోవడంతో కేంద్ర ప్రభుత్వం వెనక్కి తగ్గిందన్నారు. జూలై 17, 22 తేదీల మధ్య సదస్సుల నిర్వహణ, 23, 29 తేదీల మధ్య వీధి సమావేశాలు, ప్రదర్శనలు, ఆగస్టు 5వ తేదీన విద్యుత్ కార్యాలయాల వద్ద ధర్నాలు నిర్వహించాలని సమావేశంలో వక్తలు పిలుపునిచ్చారు. ఎల్ఐసీ ఉద్యోగుల సంఘ డివిజన్ కార్యదర్శి జి. కిషోర్‌కుమార్, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కళ్లెం వెంకటేశ్వరరావు, ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి లింగం ఫిలిప్, తదితరులు పాల్గొన్నారు.

పేర్ని నానీకి బీసీలు ఇన్నాళ్లకు జ్ఞాపకమొచ్చారా

• మాజీ ఎంపీపీ కాగిత వెంకటేశ్వరరావు

మచిలీపట్నం టౌన్, జూలై 16(ఆంధ్రజ్యోతి): తన కుమారుడికి పట్టం కట్టాలనే సంకల్పంతో ఉన్న మాజీ ఎమ్మెల్యే పేర్ని నానీకి బీసీల మీద ఇన్నాళ్లకు లేనిపోని ప్రేమ పుట్టిందని మాజీ ఎంపీపీ కాగిత వెంకటేశ్వరరావు విమర్శించారు. చిన్నాపురంలో బుధవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. వైసీపీ అధికారంలో ఉండగా పలువురు బీసీ నాయకులపై దాడులు, హత్యాయత్నాలు జరిగాయన్నారు. కొవ్వొత్తుల ర్యాలీ చేయాలని పేర్ని నానీ పిలుపునివ్వడం ఆశ్చర్యంగా ఉందన్నారు. బీసీలకు 34 శాతం రిజర్వేషన్ చంద్రబాబు ఇస్తే దాన్ని 24 శాతంకు జగన్‌రెడ్డి కుదించారన్నారు. బీసీ భవన్‌ల నిర్మాణాలు ఆపారన్నారు. టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి కాటం మధుసూదనరావు, జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ మాజీ అధ్యక్షుడు తలారి సోమశేఖర్, నాయకులు లంకే శేషగిరి, వక్కపట్ల శ్రీను పాల్గొన్నారు.


నిర్మలా కాన్వెంట్‌లో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ సీహెచ్ రాజా

భవిష్యత్తును అందంగా తీర్చిదిద్దుకోండి

• విద్యార్థులతో డీఎస్పీ సీహెచ్ రాజా

మచిలీపట్నం టౌన్, జూలై 16(ఆంధ్రజ్యోతి): విద్యార్థిదశ నుంచే సత్ప్రవర్తన, క్రమశిక్షణతో మెలిగి ఆశించిన లక్ష్యాలను చేరుకుని, భవిష్యత్తును అందంగా తీర్చిదిద్దుకోవాలని డీఎస్పీ సీహెచ్ రాజా సూచించారు. బుధవారం నిర్మలా కాన్వెంట్‌లో శక్తి బృందాలతో కలిసి నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. సమాజంలో పెరుగుతున్న నేరాల పట్ల విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలన్నారు. గుడ్, బ్యాడ్ టచ్‌లపై, పోక్సో, బాల్య వివాహాల చట్టాలపై అవగాహన కల్పించారు. మహిళల భద్రతకు శక్తియాప్ సాయం అందిస్తుందన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

పెడన, జూలై 16 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని ఏపీ మీడియా అండ్ ప్రొఫెషనల్ అసోసియేషన్ జిల్లా వైస్‌ప్రెసిడెంట్ పుట్టి కృష్ణప్రసాద్ పేర్కొన్నారు. మేరా యువ భారత్(మై భారత్) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలోని బొడ్డు నాగయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాలలో తల్లి పేరుతో ఒక మొక్క కార్యక్రమం నిర్వహించారు. తొలుత కళాశాల విద్యార్థులకు విజ్ఞాన పోటీలు నిర్వహించారు. కళాశాల ఆవరణలో పుట్టి కృష్ణప్రసాద్, ఎకనామిక్స్ లెక్చరర్ రాజ్యలక్ష్మి, జూనియర్ లెక్చరర్ ఎం.వి.గంగాధర్, విద్యార్థులు మొక్కలు నాటారు.

నేడు ర్యాలీలో పాల్గొనండి

• జనసేన కార్యకర్తలకు డీసీఎంఎస్ చైర్మన్ బండి రామకృష్ణ పిలుపు

మచిలీపట్నం టౌన్, జూలై 16 (ఆంధ్రజ్యోతి): కరగ్రహారంలో పోలీసు శిక్షణ కేంద్రం శంకుస్థాపనకు హోం మంత్రి వంగలపూడి అనిత, ఎంపీ వల్లభనేని బాలశౌరి గురువారం వస్తున్నారని డీసీఎంఎస్ చైర్మన్ బండి రామకృష్ణ తెలిపారు. ఉదయం 9.30 గంటలకు మూడు స్తంభాల సెంటర్ నుంచి నిర్వహించే ర్యాలీలో పాల్గొనాలని జనసేన కార్యకర్తలకు పిలుపునిచ్చారు.

నాలుగు టిప్పర్లకు జరిమానా

అవనిగడ్డ, జూలై 16(ఆంధ్రజ్యోతి): ఇసుక తరలిస్తున్న నాలుగు టిప్పర్లకు ఒక్కో టిప్పర్‌కు రూ.10 వేలచొప్పున జరిమానా విధించినట్లు తహసీల్దార్ నాగమల్లేశ్వరరావు తెలిపారు. అధిక లోడుతో వస్తున్న టిప్పర్లను డీఎస్పీ నిలుపుదల చేశారు. లారీలను పోలీస్ స్టేషన్‌కు తరలించి, తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లగా ఆయన జరిమానా విధించారు.

కేఈబీ కెనాల్లో గోదారి పరవళ్లు

అవనిగడ్డ రూరల్, జూలై 16(ఆంధ్రజ్యోతి): కేఈబీ కాలువలో గోదావరి- కృష్ణా నదుల సంగమం పట్టిసీమ నీటి పరవళ్లు తొక్కుతోంది. పులిచింతల నుంచి 5 వేల క్యూసెక్కులు, పట్టిసీమ నుంచి 7500క్యూసెక్కులు ప్రస్తుతం వదులుతున్నారని జలవనరుల శాఖ ఈఈ రావెళ్ల రవికిరణ్ వివరించారు. 2023-24 సీజన్‌లో స్వల్పంగా గోదావరి నీరు వచ్చిందన్నారు. 2014-2019లో అధిక భాగం గోదావరి నీరు దివిసీమ రైతులను ఆదుకుంది. గోధుమ వర్ణంలో ఉన్న గోదావరి నీరు దివిసీమలోని పంట భూముల్లోకి రావడంతో వేగంగా వ్యవసాయ పనులు ప్రారంభమయ్యాయి.